నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
సోమవారం | 07 అక్టోబర్ 2024 | www.navatelangana.com

ద్విచక్రవాహనం దొంగలించిన నిందితుడు అరెస్టు



నవతెలంగాణ-రాయపోల్ : ద్విచక్ర వాహనం దొంగలించిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించామని బేగంపేట ఏఎస్ఐ అమృత్ తెలిపారు. ఆదివారం రాయపోల్ మండలం బేగంపేట పోలీస్ స్టేషన్ లో కేసు వివరాలు తెలియజేశారు. ఆదివారం ఉదయం 06:00 గంటలకు మక్తమాసాన్ పల్లి బస్సు స్టాప్ వద్ద ఏఎస్ఐ అమృత్, పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ముగ్గురు వ్యక్తులు తూప్రాన్ నుంచి గజ్వేల్ వైపు పల్సర్ వాహనంపై వచ్చి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా, సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్ గ్రామానికి చెందిన కమ్మరి నరసింహ చారి, మరో ఇద్దరు మైనర్ పిల్లలు మొత్తం ముగ్గురు కలిసి గత నెల 21వ తేదిన రాత్రి ఒంటి గంటకు సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్ పల్లి గ్రామం శాఖరం ఎక్స్ రోడ్ నుంచి టీఎస్ 36- ఎల్ 8383 నెంబర్ గల ద్విచక్ర వాహనాన్ని దొంగిలించినట్టు అంగీకరించారు. నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. ఆదివారం కమ్మరి నర్సింహాచారిని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులను పట్టుకోవడంలో చురుకుగా వ్యవహరించిన ఏఎస్ఐ అమృత్, పోలీస్ సిబ్బంది కనకరాజు, సత్యనారాయణ, ప్రదీప్ లను తొగుట సిఐ లతీఫ్ అభినందించారు.

స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం సహకారం అందించాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

యువత స్వయం ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని నక్కిర్తి సుధాకర్ అన్నారు. అప్పుడే యువత పక్కదారి పట్టకుండా కుటుంబ పోషణ చూసుకుంటూ.. బాధ్యతయుతంగా పనులు చేసుకుంటారన్నారు. ఎస్ఎంఆర్ యువసేన మరియు తన కుటుంబ సభ్యులతో కలిసి గుమ్మడిదల టోల్గేట్ సమీపంలో డిలైట్ ట్రీట్ టీ పాయింట్, టిఫిన్ సెంటర్ షాపును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంబుగారి బాలరాజు, పోతారం యాదగిరి, ఏడుకొండలు, నకీర్తి సుధాకర్, ఆంజనేయులు, కుటుంబ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-సిద్దిపేట

మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రక్తదాన శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సిద్ధిపేట సర్వజన ఆస్పత్రిలోని రక్త నిధి కేంద్రంలో స్వచ్ఛందంగా 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని శ్రావణి, అసోసియేషన్ అధ్యక్షుడు గందె సంతోష్ కుమార్ మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. మూడు నెలలకోసారి రక్తం ఇస్తే చెడు రక్తం పోయి మంచి రక్తం తయారవుతుందన్నారు. రక్తదానం చేస్తే అనారోగ్యానికి గురవుతామన్నది కేవలం అపోహ మాత్రమేనని, ప్రతి ఒక్కరు కూడా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సూచించారు. గతంలో కూడా అసోసియేషన్ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేశామని, ఇక ముందు కూడా మరిన్ని స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులను రక్తనిధి కేంద్ర నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, రక్త నిది కేంద్రం నిర్వాహకులు కనకచంద్రం, అంజయ్య, ఇమ్రాన్, శ్రీనివాస్, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ద్విచక్ర వాహనం డివైడర్‌ని ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం ముంగిస పల్లి గ్రామానికి చెందిన కొత్త శివ(21) కుటుంబం సభ్యులతో కలిసి గజ్వేల్‌లో నివాసం ఉంటున్నారు. తన ద్విచక్ర వాహనంపై ప్రజ్ఞాపూర్ నుంచి గౌరారం వైపు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి గాయపడిన శివను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాద ఘటనపై విచారణ చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

అడుగడుగునా గుంతలు .. ప్రయాణికులకు తిప్పలు

గుంతల రోడ్డు అరచేతిలో ప్రయాణం !!
గుంతలు మరమ్మత్తులు చేసేదేఎప్పుడో!!



నవతెలంగాణ-న్యాల్ కల్

ఆర్ అండ్ బి రోడ్డు అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు పడి నిత్యం రాకపోకలు చేసే ప్రజలకు, వాహన దారులకు ప్రయాణం నరకంగా మారుతుంది. జహీరాబాద్ - బీదర్ ప్రధాన ఆర్ అండ్ బి రోడ్డు భారీ వర్షాలు కురిసి ప్రధాన అతి పెద్ద మోకాలు లోతు వరకు గుంతల మయంగా మారింది. ఈ రోడ్లపై కెపాసిటీకి మించి ఇసుక లారీలు వెళ్లడంతోనే రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయాందోళనతో ప్రయాణించాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. సుమారు 25 కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదని ఆర్ అండ్ బి అధికారులపై మండిపడుతున్నారు. వాహనదారులు, ప్రజలు అత్యవసర పరిస్థితులో రాత్రి వేళలో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి రోడ్డు బాగు చేయాలని పప్రజలు కోరుతున్నారు.

జిన్నారంలో అన్నదానం



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన మా దుర్గా భవాని మండపం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దుర్గ భవానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానంలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



నవతెలంగాణ-కొమురవెల్లి

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితున్ని కఠినంగా శిక్షించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని మాల మహానాడు నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఘటనను కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు ఖండించాలని, నిందితున్ని కఠినంగా శిక్షించే వరకు మాల మహానాడు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి మద్దతు ఉంటుందని తెలిపారు. సమాజంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు, అమ్మాయిలపై ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తలారి కిషన్, జిల్లా ఉపాధ్యక్షులు మందాల బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు తుక్కుజి సతీష్ కుమార్, భామల్లపల్లి రమేష్, సుక్కోజి కిష్టయ్య, తుక్కోజి నర్సింహులు, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-కల్హేర్

మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సభ్యులు ప్రసాది రవిశంకర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కొటాలే రజినీకాంత్, మండల అధ్యక్షులు యెన్నం అనిల్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అల్లపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ గడ్డ.. సీఐటీయూ అడ్డా



- పరిశ్రమల్లో వరుస విజయాలు
- నిన్న రాక్‌వూల్.. నేడు మహేంద్ర సీఐఈ
- ఎర్రజెండా వైపే కార్మిక వర్గం..

నవతెలంగాణ-జహీరాబాద్

దినదినాభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతంలో కార్మిక వర్గం సీఐటీయూ పక్షాన్నే నిలుస్తున్నది. స్థానిక సీఐటీయూ నాయకులు చేస్తున్న కృషితో జహీరాబాద్ డివిజన్లోని పరిశ్రమలన్నింటిలో సీఐటీయూ ఎర్రజెండానే రెపరెపలాడుతున్నది. ఇప్పటికే మహేంద్ర అండ్ మహేంద్ర ప్రధాన పరిశ్రమలో వరుసగా ఆరు పర్యాయాలుగా గెలుపొందుతూ పరిశ్రమ చరిత్రను తిరగ రాసిన ఘనత సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములుకే దక్కిది. దానికి తోడు మహేంద్ర అండ్ మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్‌లో



ఇటీవలే జరిగిన ఎన్నికల్లో సైతం చుక్కరాములను కార్మికులు భారీ మెజారిటీతో గెలిపించిన విషయం తెలిసిందే. కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామ పరిధిలోని పిరమిడ్ ఇండియా పరిశ్రమలో కొన్ని నెలల క్రితం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూనే జయభేరీ మోగించింది. ఈ పరిశ్రమలో చుక్క రాములు మెరుగైన వేతన ఒప్పందంతో పాటు కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకోవడంతో ప్రతిపక్ష యూనియన్‌లోని నాయకులు సైతం సీఐటీయూలో చేరడం గమనార్హం. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు.. ఎప్పుడు, ఎక్కడ ఏ సమావేశం జరిగినా కార్మికులందర్నీ కలుపుకపోవడం చేస్తున్నారు. ఎన్నికలప్పుడే యూనియన్లు, ఎన్నికల అనంతరం కార్మిక వర్గం అంతా ఒకటే అనే నినాదంతో ముందుకు వెళ్లడంతో ఇతర యూనియన్ల నాయకులు కూడా సీఐటీయూ వైపు ఆకర్షితులవుతున్నారు.

జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం కవేలి గ్రామ పరిధిలో గల రాక్‌వూల్ పరిశ్రమలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మల్లేశం భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. గత రెండు రోజుల క్రితం(శనివారం) జరిగిన ఎన్నికల్లో మహేంద్ర సిఐఈ ఆటోమోటివ్ ఇండియా పరిశ్రమలోనూ బి.మల్లేశం భారీ మెజారిటీతో గెలుపొందడంతో జహీరాబాద్ నియోజకవర్గం సీఐటీయూ అడ్డాగా మారిపోయింది. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులే కాకుండా వారి కుటుంబ సభ్యుల్లో 10వ తరగతి పాస్ అయి ఉంటే చాలు వారికి మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో ఉద్యోగాలు ఇప్పించడంలో చుక్క రాములు సఫలీకృతమవుతున్నారు. మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో ఆయనకు సాటి మరి ఎవరు లేరన్న చర్చ సైతం కార్మికుల్లో నడుస్తోంది. గతంలో ఉన్న యూనియన్లు తాకట్టు పెట్టిన కార్మిక సంక్షేమ చట్టాల న్నింటిని తిరిగి ఒప్పందాల్లో తీసుకువచ్చి కార్మికులందరికీ ఈ ఎస్ఐ ,పిఎఫ్, బోనస్, డీఏ అలవెన్స్ సైతం ఇప్పించడంలో చాకచక్యంగా వ్యవహరించడంతో కార్మికుల మనసులో చుక్క తన గూడును కట్టుకున్నారు.

చుక్క బాటలోనే మల్లేశం..

చుక్క రాములు బాటలోనే సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.మల్లేశం కొనసాగుతున్నారు. రాక్‌వూల్ పరిశ్రమ, మహేంద్ర సిఐఈ పరిశ్రమల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చేస్తున్న పోరాటాలతో కార్మికులు ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటున్నారు. మృదుస్వభావి అయిన మల్లేషం.. నిత్యం కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ఎప్పుడు వారికి వెన్నంటూ ఉండి ముందుకు నడిపించడంతో కార్మికులందరినీ ఆకర్షించే కలుగుతున్నారు.

ఓట్లు వేసే వారే కాదు అందరూ కార్మికులే..

సీఐటీయూ గెలుపొందిన పరిశ్రమల అన్నింటిలో తమకు ఓటు వేసి గెలిపించిన కార్మికులతో పాటు ఆయా పరిశ్రమల్లోని వివిధ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సైతం సౌకర్యాలు కల్పించడంలో సీఐటీయూ నాయకులు ముందుంటున్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ పండగలకు మిఠాయిలు, సేఫ్టీ షూలు, యూనిఫామ్‌లతో పాటు సౌకర్యాలను కూడా కల్పిస్తున్న ఘనత సీఐటీయూదే. అందుచేతనే కార్మిక వర్గంలో తమకంటూ ముద్ర వేసుకుంటున్నారు.

పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి

ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-కంది

పేదలందరకీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరికి సంతాపాన్ని ప్రకటించారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో గత 20ఏండ్లుగా ఇండ్ల స్థలాలు లేక, కిరాయి కట్టలని పరిస్థితుల్లో అనేకమంది పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమిస్తున్నారని, ఆ భూములను ప్రభుత్వం స్వాధీన పరుచుకుని పేదలకు ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన అంశాలను తెచ్చి ఐక్యం కాకుండా విచ్ఛిన్నం చేయాలని చూస్తోంద న్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గమన్నారు. ఇన్నేండ్ల స్వతంత్ర భారతంలో ఇంకా మౌలిక వసతుల గురించి మాట్లాడే దౌర్భాగ్య స్థితిలో ఉండటానికి పాలకుల విధానాలే కారణమన్నారు. దేశ రాజకీయం కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిందని, రాజకీయ కార్పొరేటి కరణ జరిగి భారత ప్రజాస్వామ్య వ్యవస్థ కే హాని జరిగే అవకాశం ఉందన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించి రైతులు ఇంకా అయోమయంలో ఉన్నారన్నారు. రేషన్‌కార్డులు, ఆసరా పెన్షన్‌లు వెంటనే ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఇంటి స్థలాల సమస్యలు, మురికి కాలువలు, సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నార న్నారు. రైతులు, కూలీలు, అసంఘటితరంగ కార్మికులు,మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, దళితులు, మైనార్టీలు తదితరుల సమస్యలపై నికరమైన పోరాటాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం. నరసింహులు, జిల్లా నాయకులు అశోక్, రాజయ్య, మండల కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్

శివ్వంపేటలో సీపీఐ(ఎం) అందోల్ ఏరియా ద్వితీయ మహాసభలు



నవతెలంగాణ-చౌటకూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సమరశీల పోరాటాలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేస్తూనే ఉంటా మని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ అన్నారు. చౌటకూర్ మండలం శివ్వంపేటలో ఆదివారం సీపీఐ(ఎం) ఆందోల్ ఏరియా ద్వితీయ మహాసభ జరిగింది. ఈ మహాసభల పార్టీ జెండాను మాణిక్ ఆవిష్కరించారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మరణించిన పార్టీ అగ్రనేత కామ్రేడ్ సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా విప్లవ జోహార్లు అర్పిం చారు. అనంతరం మాణిక్ మాట్లాడుతూ.. పాలక పార్టీలు ఎన్నికల సందర్భంగా వాగ్దానాలు చేస్తూ గద్దెనెక్కినాక ప్రజలను మర్చిపోతున్నారన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేకంగా విధానాలను అవలంభిస్తున్నదన్నారు. అంబానీ, ఆదాని లాంటి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నదన్నారు. నిత్యవసర సరుకుల ధరలు రోజు రోజుకు పెద్ద ఎత్తున పెంచి సామాన్య ప్రజలపై భారాలు వేస్తున్నదన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక విలువలపై దాడిచేస్తూ తన మతోన్మాద విధానాలను అమలు చేస్తున్నదని.. దాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి సాయిలు మాట్లాడుతూ.. పేదల భూములు గుంజుకొని పెద్దలకు అప్పచెబుతున్నారన్నారు. ధరణిలో పేదల అసైన్మెంట్ భూములకు నేటికీ అనేక గ్రామాల్లో పట్టా పాస్ పుస్తకాలు రాలేదని గుర్తు చేశారు.పేదలకు భూములు పంచింది, ఇళ్ల స్థలాల కోసం పోరాడింది కమ్యూనిస్టులు ఎర్రజెండా మాత్రమే అన్నారు. కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నది సీపీఐ(ఎం) మాత్రమే అన్నారు. ఈ మహాసభలో అందోల్ ఏరియా కన్వీనర్ డి.విద్యాసాగర్ చౌటకూర్, మండల బాధ్యులు నాగభూషణం, నాయకులు సురేష్, రాములు,ప్రభాకర్, శ్రీశైలం, మహేష్,శీను, కృష్ణ ,అందోల్, పుల్కల్, వట్ పల్లి,హత్నూర మండలాల శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీలతో వెట్టి చాకిరి చేయిస్తున్న ప్రభుత్వం

- జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలి
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



నవ తెలంగాణ-గజ్వేల్

మున్సిపల్ పట్టణాల్లో మెప్మా పరిధిలో పనిచేస్తున్న ఆర్‌పీలకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు అమలు చేసి బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేవలం రూ.6 వేల గౌరవ వేతనమిస్తూ వెట్టి చాకిరి చేయించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సర్వేలు సంక్షేమ పథకాలు, ఎన్నికల కోసం అనేక రకాలుగా ప్రభుత్వ పనులకు ఉపయోగించుకుంటున్నారన్నారు. డ్వాక్రా మహిళలకు గ్రూపులు ఏర్పాటు చేయడం అనేక విధాలుగా రుణాలు మంజూరు ఇప్పించడం మరలా ప్రతినెల రుణాలు కట్టే విధంగా గ్రూప్ సభ్యులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. నిత్యం ఆన్లైన్‌లో విధులు నిర్వహిస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రారంభించినప్పుడు సభలు సమావేశాలకు డ్వాక్రా మహిళలను సమీకరించి విజయవంతం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఆర్పీలందరికీ జీవో 60 ప్రకారం రూ.19500 ఇవ్వాలని, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

యూనియన్ గౌరవాధ్యక్షులుగా సందబోయిన ఎల్లయ్య, అధ్యక్షులుగా సుభద్ర, ప్రధాన కార్యదర్శిగా కల్పన, కోశాధికారిగా మనోహరి, ఉపాధ్యక్షులుగా పద్మ, వర కుమారి, సహాయ కార్యదర్శులుగా సంధ్య, పావని కమిటీ సభ్యులుగా ఫాతిమా, భవాని, కృష్ణలీల ఎన్నిక కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, నాయకులు వెంకట చారి, ఆర్పిలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

మండలంలో ఆకస్మిక పర్యటన



నవతెలంగాణ-మునిపల్లి

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. మండలంలోని కంకోల్ గ్రామ శివారులో నూతనంగా నిర్మించనున్న ట్రూమా హెల్త్ సెంటర్‌కు సంబంధించిన స్థలాన్ని ఆదివారం పరిశీలిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు అయితే చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు.

అనంతరం అనారోగ్యానికి గురైన మాజీ ఎంపీపీ రాజేశ్వరరావును బుదేరా చౌరస్తాలోని ఆయన నివాసానికి వెళ్లి మంత్రి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేయించుకోవాలని, అధైర్య పడవద్దు అని ధైర్యానిచ్చారు. బుదేరా గ్రామంలో రేషన్ దుకాణం ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని.. బుదేరా చౌరస్తాలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రి వెంట మాజీ ఎంపీపీ రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి పాండు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గులాం రసూల్, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు రహీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

పెట్రోల్, డీజిల్ నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ-కొమురవెల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పోసానిపల్లి లో సీపీఐ(ఎం) శాఖ మహాసభ సత్తయ్య అధ్యక్షతన జరిగింది ఈ సభలో సత్తిరెడ్డి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రధాని మోడీ పాలన గాలికి వదిలేసి విదేశీ పర్యటనలు చేస్తున్నారన్నారు. విద్వేష ప్రసంగాలతో ప్రజలను రెచ్చగొట్టి పాలన కొనసాగిస్తున్నాడని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ మన దేశంలో మాత్రం పెట్రోల్ డీజిల్ ధరలు ఏ మాత్రం తగ్గించడం లేదని, ఆయిల్ కంపెనీలకు కోట్లాది రూపాయలు లాభాలు చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వ వైఖరి ఉందన్నారు బీజేపీ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా పేదలపై భారాలు మోపుతూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో అనేక హామీలు ఇచ్చి అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు రైతులకు ఇప్పటివరకు రైతుబంధు వేయలేదని ఎన్నికలలో హామీ ఇచ్చినట్లుగా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పోసానిపల్లి గ్రామంలో డ్రైనేజ్ నిర్మాణం లేకపోవడంతో ఇండ్లలోకి వరద నీరు వచ్చి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే డ్రైనేజీ పనులు చేపట్టాలని, వీధిలైట్లు వేయాలని మహాసభ డిమాండ్ చేసింది. అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా సొక్కం ప్రశాంత్ బాబును శాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, మండల నాయకులు భిక్కిల్లి బాలకిషన్, నరేందర్, స్వామి, పూస మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

- డ్యూటీలో ఉండగా అకస్మాత్తుగా గుండెపోటు
- గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి





నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

డ్యూటీలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌కు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృతి చెందాడు. ఈ సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని గౌరారం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హుజురాబాద్ బస్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ రమేష్ సింగ్(46) హైదరాబాద్ ప్రయాణమయ్యాడు. హైదరాబాద్ వెళ్లే బస్సులో సుమారు 45 మంది ప్రయాణికులు ఉన్నారు. హైదరాబాదులో డిఆర్‌డిఏ సమావేశానికి వెళ్లేందుకు ఉద్యోగులు అద్దెకు బస్సును తీసుకువెళ్తున్నారు. ఉద్యోగులను తీసుకెళ్తున్న బస్సు డ్రైవర్ రమేష్ సింగ్ ఉద్యోగుల కోరిక మేరకు ప్రజ్ఞాపూర్ దాటిన తర్వాత మార్గమధ్యంలో గౌరారం సమీపంలో హోటల్ వద్ద టిఫిన్ చేసేందుకు బస్సును నిలిపాడు. టిఫిన్ చేసిన అనంతరం ఒక్కసారిగా రమేష్ సింగ్‌కు ఛాతిలో నొప్పి రావడం అక్కడ ఉన్న వారు గమనించారు. వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఈ ఘటనపై హుజురాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ గజ్వేల్ డిపో మేనేజర్ పవన్‌కి సమాచారం అందించారు. ప్రమాదంలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌ను ఆస్పత్రికి చేర్చాల్సిందిగా కోరారు. గజ్వేల్ డిపో మేనేజర్ పవన్ సిఐ బాబు నాయక్‌కు విషయం చెప్పి ఆసుపత్రికి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. ఆర్టీసీ డ్రైవర్ రమేష్ సింగ్‌ను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స ప్రారంభించారు. చికిత్స పొందుతూ 10 నిమిషాల వ్యవధిలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్ళు, ఉన్నట్టు సమాచారం.

హుస్నాబాద్‌లో నేడు మంత్రి పర్యటన



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్‌లో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారని బిసి సంక్షేమ రవాణా శాఖ మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. హుస్నాబాద్‌లో ఇందిరా శక్తి క్యాంటీన్, నాగారం రోడ్డులో శ్రీ ఆదర్శ ఎంటర్ ప్రైజెస్ ఎలక్ట్రికల్ బైక్ షోరూంను మంత్రి ప్రారంభించనున్నారు. సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్న పేట్ చౌరస్తాలో బహుజన బతుకమ్మ కార్యక్రమంలో విమలక్కతో కలిసి మంత్రి పాల్గొంటారు.

'అలయ్ బలయ్' కోసం ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రంలో ఈనెల 14న అలైబలై కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం వెంకట కాజా ఫంక్షన్‌హాలును పరిశీలించారు. ప్రతి యేటా దసరా పండుగను పురస్కరించుకొని.. అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు వీరారెడ్డి, శివాజీ రావు, మధు తదితరులు ఉన్నారు.



మృతుల కుటుంబాలకు అక్షయపాత్ర ఆర్థిక సాయం

నవతెలంగాణ-చౌటకూర్



మండలంలోని గంగోజిపేట, ఈసోజిపేట గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు జులై 25వ తేదిన అక్షయపాత్రలో ఉద్యోగానికి వెళుతు మార్గమధ్యలో యాక్సిడెంట్‌తో ముగ్గురూ మృతి చెందారు. మృతుల కుటుంబాలకు అక్షయ పాత్ర ఫౌండేషన్ నుంచి ప్రతీ కుటుంబానికి రెండు లక్షల చొప్పున చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, బాబు జగ్జీవన్ రామ్ సమతా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.వేణు గోపాల్, అక్షయపాత్ర యాజమాన్యం వినయ్, మధుసూదన్, కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ వెంకటేశం, మృతుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ కానుక లేనట్టేనా?



- ప్రభుత్వంపై మహిళల అసంతృప్తి
- కార్యాలయాల్లో ప్రారంభమైన బతుకమ్మ సంబురాలు
- ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్న మహిళలు

నవతెలంగాణ-ఝరాసంగం

బతుకమ్మ చీరలు నాణ్యత లేవని గతంలో అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ రాస్తారోకోలు, ధర్నాలు చేసిన విషయం విధితమే. అయితే ప్రస్తుతం అదే పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ.. మహిళలకు అందించే బతుకమ్మ చీరలపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం పై మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే కానుకలు ఈ ఏడాది లేనట్లుగానే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బతుకమ్మ చీరల పంపిణీని రద్దు చేస్తున్నామని, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు మాత్రమే ఏడాదికి రెండు చీరలను ఉచితంగా అందజేస్తామని ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం ప్రకటించారు. కానీ దానిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత వెలువడలేదు. ఓ దశలో చీరలకు బదులుగా ఆడపడచులకు ఒక్కొక్కరికి ఐదు వందల నగదు ను వారి ఖాతాల్లోనే జమచేసేలా ఆలోచిస్తున్నట్లుగా ప్రచా రం కూడా జరుగుతోంది. కానీ దీనిపైనా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మరోవైపు బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహిళలు రంగురంగుల పువ్వులు పేర్చిన బతుకమ్మలతో కోలాటాలు ఆడుతూ సందడి చేస్తున్నారు. ప్రభుత్వం ఈసారి ఎలాంటి కానుకలు ఇస్తుందోనని మహిళలు ఆసక్తిగా నిరీక్షిస్తున్నారు.

గత ప్రభుత్వంలో..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కొన్నేళ్ల పాటు మహిళలకు కానుకగా చీరలను పంపిణీ చేసింది. బతుకమ్మ వేడుకల ప్రారంభానికి ముందుగానే మండలానికి అవసరమైన చీరలను పంపించేది. వాటిని డీఆర్డీఏ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఎంతో ఆర్భాటంగా పంపిణీ చేసేవారు. రేషన్ కార్డు కలిగి ఉండి, 18 ఏళ్ల వయస్సు నిండిన యువతులు, మహిళలందరికీ బతుకమ్మ చీరలను అందించేవారు. గతేడాది మండలంలో 34 రెవెన్యూ గ్రామాలకు గానూ 29 రేషన్ షాపులో 12,306 కార్డు దారులకు ఒక్కొటి చొప్పున చీరలను ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన చీరల నాణ్యతపైన అప్పట్లో పలువురు మహిళలు అసహనం వ్యక్తం చేసిన విషయం విదితమే. పలుచోట్ల చీరలను దగ్ధం చేసిన మహిళలు అప్పటి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళనలను సైతం చేపట్టారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ సైతం చీరల నాణ్యతపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే బతుకమ్మ చీరల పంపిణీని రద్దు చేసినట్టుగా తెలుస్తోంది. అంతేకాకుండా గత పదేండ్లలో బతుకమ్మ చీరల పంపిణీలో అనేక అక్రమాలు జరిగాయని ప్రస్తుత అధికార పార్టీ ప్రతిపక్షంపై ఎన్నో విమర్శలు గుప్పించింది. దీన్ని బట్టి చూస్తే ఈ ఏడాది చీరల పంపిణీ ఉన్నట్టా లేక ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఏవైనా ఆలోచన చేస్తోందా అన్న విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

బతుకమ్మ కానుకలు ఉన్నట్టా.. లేనట్టా?

బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టుగా ప్రస్తుత సీఎం ఓ కార్యక్రమంలో మాట్లాడిన విషయం అందరికీ తెలిసిందే. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు మాత్రమే ఏడాదికి రెండు చీరలను ఉచితంగా అందిస్తామని చెప్పారు. దీంతో లబ్దిదారుల సంఖ్య భారీగా తగ్గిపోయే అవకాశం లేకపోలేదు. అయితే ప్రభుత్వం ఇచ్చినా అవి ప్రస్తుత బతుకమ్మ పండుగకు పంపిణీ అవుతాయో లేదో కన్పించడం లేదు. దసరా పండగ సైతం మరో 5 రోజుల్లోనే ఉంది. ఇప్పటికిప్పుడు చీరలను జిల్లాకు పంపించినా జిల్లా నుంచి మండలాలకు అక్కడి నుంచి గ్రామాలకు పంపిణీ చేయడం అసాధ్యం అని పలువురు చెబుతున్నారు. కాగా చీరలకు బదులుగా రూ.500 నగదును మహిళల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జను చేస్తుందనే చర్చ సైతం మహిళల్లో జోరుగా సాగింది. ఈ అంశంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దంతో అది ప్రచారం గానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ కానుకలను అందిస్తుందా? లేక వాటిని రద్దు చేస్తుందా? అంశం ప్రస్తుతం మహిళావర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. కానుకల విషయంపై ప్రతిపక్ష నాయకులు అధికారపక్షంపై విమర్శలు గుప్పిస్తున్నారు. గత ఐదు రోజుల్లో ప్రభుత్వం నగదు బదిలీకే మొగ్గు చూపుతుందా లేక రద్దు చేస్తుందా అనేది మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

నాణ్యమైన చీరలంటూ పేరుకే ఆదేశాలు



మహిళల కోసం ప్రతి ఏడాది కోటి బతుకమ్మ చీరలు కానుకల పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం మరచిపోయింది. పండుగ సమీపిస్తున్న ఇప్పటి వరకు చీరల పంపిణి ఊసేలేదు. నాణ్యత గల చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం పేరుకు మాత్రమే అధికారులను అదేశించి ందని.. కానీ అమలు మాత్రం మరిచింది. పండుగ సమీపిస్తున్నా ప్రభుత్వం కనీసం కానుకలు ఇచ్చే అంశం కూడా తెరపైకి దేవకపోవడం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే బతుకమ్మ చీరలకు మంగళంపాడడం అంటే మహిళలనుఅవమానించడమే.ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

\- పరమేశ్వర్ పాటిల్, మేదపల్లి మాజీ సర్పంచ్

జిల్లా గ్రంథాలయ చైర్మెన్‌గా జి.అంజయ్య

నవతెలంగాణ-రాయికోడ్



జిల్లా గ్రంథాలయ చైర్మెన్‌గా జి.అంజయ్య నియమితులయ్యారు. రాయికోడ్ మండలం నాగ్వార్ గ్రామానికి చెందిన జి.అంజయ్య జిల్లా స్థాయి పదవి దక్కించుకోవడంపై మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. గతంలో ఆయన జెడ్పీటీసీగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా పదవులు చేపట్టారు. ప్రముఖ న్యాయవాదిగా స్వచ్ఛంద కార్యక్రమాలు ఎన్నో చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అనుచరుడిగా పేరుగాంచిన అంజయ్యకు జిల్లా గ్రంథాల చైర్మెన్ పదవి దక్కడం పట్ల మండలంలోని పలువురు అభినందించారు.



కేతకిలో సీఐ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఝరాసంగం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కేతకి ఆలయంలో వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గాదేవీ ఆదివారం ఆకుపచ్చ రంగు వస్త్రంలో బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం దుర్గాదేవికి అభిషేకము, విగ్నేశ్వర పూజ, లలిత హెూమం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు కుటుంబ సమేతంగా సందర్శించి సంగమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ఉత్సాహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్చార్జి ఈవో శశిధర్, అర్చక బృందం, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాటూర్ ఫ్యాక్టరీలో యంత్ర పూజలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని మాటూరు శివారులో గల గోదావరి గంగా ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రయివేటు లిమిటెడ్ చక్కెర ఫ్యాక్టరీలో ఆదివారం యంత్ర పూజలు చేశారు. కాగా నవంబర్‌లో క్రషింగ్ ప్రారంభం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు డైరెక్టర్లు మహేష్ బండారి, అమన్ గోయల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ జీఎం నరేందర్ రెడ్డి, కేన్ జీఎం రవీందర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ పాటిల్, ఓంకార్ తదితరులున్నారు.



డంపింగ్ యార్డ్ మాకొద్దంటూ ఐక్య పోరాటం

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధి ప్యారానగర్ పరిసర ప్రాంతాల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును నిరసిస్తూ గ్రామస్తులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఆదివారం గ్రామ యవత ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకుండా గ్రామస్థాయి నుంచి ప్రత్యేక ప్రణాళిక బద్ధంగా మండల, జిల్లా ఉన్నతాధికారులకు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయొద్దని నివేదికలు ఇస్తామన్నారు. డంపింగ్ యార్డు నిలిపివేసేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యేంతవరకు పోరాటం చేస్తామన్నారు.



అన్నపూర్ణ దేవిగా ముమాదేవి

నవతెలంగాణ-రాయికోడ్

మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ఉమాదేవి ఆలయంలో అమ్మవారు ఆదివారం అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో భజన కీర్తనలు ఆలపించి ప్రత్యేక పూజలు చేశారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవ పూజలు

నవతెలంగాణ-న్యాల్‌కల్



నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రేజింతల్ హనుమాన్ మందిర ఆలయం వద్ద చేపట్టిన దుర్గామాతకు పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గాదేవీ త్రిపుర సుందరి మాతగా భక్తులకు దర్శనమిచ్చింది.



ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని కేబీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రి ఉత్సవాలకు జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొలను రవీందర్ రెడ్డి ఆదివారం ముఖ్యఅతిథిలుగా హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి మండపం వద్ద టీమ్ కేబీఆర్' కమిటీ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లగూర్ల లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదగిరి గౌడ్, విజయ్ రెడ్డి ,అనంత గురు స్వామి, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహాన్ని నింపొచ్చు

- ఎమ్మెల్యే మాణిక్యరావు

నవతెలంగాణ-జహీరాబాద్



పండుగల్లో భజనలాంటి సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తుల్లో ఉత్సాహాన్ని నింపవచ్చని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. పట్టణంలోని భవాని మాతా మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఏర్పాటుచేసిన భజన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీయేడు ఆలయ కమిటీ వారు నిర్వహిస్తున్న ఉత్సవాలు భక్తులకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తున్నాయన్నారు. దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందలు తెలిపారు. భవానీ భజన మండలి వారి ఆహ్వానం మేరకు భజన మండలి వారికి సన్మానం చేసి, నృత్యాలు చేసిన చిన్నారులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేతకీ సంగమేశ్వర ఆలయ మాజీ చైర్మన్ నీల వెంకటేశం, ఆత్మ చైర్మెన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ అశోక్ శేరి, ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పీకేఆర్ ట్రస్ట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



నారాయణఖేడ్ పట్టణంలోని తహసీల్దార్ గ్రౌండ్‌లో పీకేఆర్ ట్రస్ట్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నారాయణఖేడ్ ప్రీమియం లీగ్ (ఎన్పిఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ని డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్ర శేఖర్ రెడ్డి, పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. క్రికెట్ బ్యాట్‌తో రెండు బంతులు ఆడి టోర్నమెంట్‌ని ప్రారంభించి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఆనంద్ స్వరూప్ శెట్కర్, మున్సిపల్ వైస్ చైర్మెన్ శంకర్ సెట్, రాజేష్, హనుమాండ్లు, వివేకానంద, సద్దాం, రామకృష్ణ, నర్సింలు, మాజిద్ కౌన్సిలర్లు, మరియు జూలా నాయక్, మాజీ ఎంపీపీ, నారాయణ జాదవ్, పండరినాథ్ మాజీ ఎంపీటీసీ, ఆరిఫ్, దీపక్ రెడ్డి యువనాయకులు, సిద్ధరెడ్డి, ఆకాష్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, పవన్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి ఎమ్మెల్యే సతీమణి పరామర్శ



నవతెలంగాణ-కల్హేర్

మండల కేంద్రమైన నిజాంపేట మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి మేనత్త సుశీలమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సతీమణి పట్లోళ్ల అనుపమరెడ్డి ఆదివారం సుశీలమ్మ ఇంటికెళ్లి చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. తర్వాత లింగారెడ్డిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపి మనోధైర్యాన్ని అందించారు. ఆమెతోపాటు మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు





నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని ఇష్టా జూనియర్ కళాశాలలో ఆదివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇష్టా జూనియర్ కళాశాల డైరెక్టర్ వినోద్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ రవి కిరణ్ రెడ్డి, అకాడమిక్ ప్రిన్సిపల్ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపల్ షేక్ ఇబ్రహీం, కళాశాల లెక్చరర్ బృందం హాజరయ్యారు. విద్యార్థులు ఉత్సాహంతో బతుకమ్మ పాటలు పాడుకుంటూ, నృత్యాలు చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవికిరణ్ రెడ్డి బతుకమ్మ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా జరిపారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డీడీఎమ్ఎస్ పీఎంసీ ఎస్టీవీసీ చైర్‌పర్సన్ బండారు రాణి, కోఆర్డినేటర్ కల్పనా, ప్రిన్సిపాల్ ఆయేషా సిద్ధిఖా పాల్గొన్నారు. రకరకాల పూలతో అలంకరించిన బతుక మ్మ వద్ద ఆటాపా టల విద్యార్థులు సందడి చేశారు. ఈ వేడుకల్లో దుర్గాబాయి దేశ్ ముఖ్ మహిళా సభ సంగారెడ్డి శాఖ సిబ్బంది అషిలీ శ్రీవాణి, ఎస్తేరు రాణి, షబానా విద్యార్థిణులు పాల్గొన్నారు.

విశేషంగా అలరిస్తున్న మా దుర్గ భవాని

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో మా దుర్గా భవాని మండపం సెట్టింగ్ భక్తులను విశేషంగా అలరిస్తోంది. ఉదయం సాయంత్రం వేళల్లో భక్తులు దేవి శరన్నవరాత్రుల నేపద్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ బృందం స్థానిక జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన దుర్గాభవాని ప్రత్యేక మండపం తీరును పలువురు ప్రశంసిస్తున్నారు. బుక్క యాదయ్య కుటుంబం అన్న పసాద కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కె.ప్రసాద్ రెడ్డి సేవలు అభినందనీయం

నవతెలంగాణ-కోహీర్



వివిధ గ్రామాల్లో కే.ప్రసాద్‌రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఇన్‌చార్జి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పిచరాగడితాండాలో కె.ప్రసాద్‌రెడ్డి సేవా కార్యక్రమాల్లో భాగంగా చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించిన శిలాఫలకాన్ని చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టి పెరిగిన ప్రాంతానికి సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. తాండారోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని, గ్రామంలో వక్ఫ్ భూముల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మిస్తావన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు రామలింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హర్షద్, యేసు, ప్రసాద్‌రెడ్డి, ఉగ్గెల్లి రాములు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘాటైన వాసనలతో ఉక్కిరిబిక్కిరి

- శ్వాస తీసుకోవడానికి కూడా కష్టంగా ఉంది
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గడ్డపోతారం వాసులు

నవతెలంగాణ-జిన్నారం



మండలంలోని గడ్డపోతారం పారిశ్రామిక ప్రాంత ప్రజలు పరిశ్రమల నుంచి వెలువడుతున్న ఘాటైన వాస నలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కనీసం శ్వాస తీసుకోవడానికి కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు పరిస్థితి మరీ దారుణంగా మారిందని వాపోతున్నారు. తాజాగా పారిశ్రామిక ఘాటైన విష వాయువులవల్ల శనివారం రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై పిసిబి యంత్రాంగానికి ఫిర్యాదు చేయగా గడ్డపోతారం గ్రామాన్ని సందర్శించారని.. వారికి సమస్య గురించి వివరించినట్టు చెప్పారు.

శాశ్వత పరిష్కారానికి చర్యలు కావాలి..

గడ్డపోతారం పరిసర గ్రామాలకు సమీపంలోనే పరిశ్రమలు విస్తరించడం.. పారిశ్రామిక ఉత్పత్తుల నేపథ్యంలో ఇక్కడ వాయు కాలుష్యం, నీటి కాలుష్యంతో తీవ్ర సమస్య ఏర్పడుతున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు పశువులు కూడా మృత్యువాత పడ్డాయని చెప్పారు.వాయు, నీటి కాలుష్య సమస్యకు సంబంధించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీపీఐ(ఎం) మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-కొండాపూర్

ఈనెల 19,20 తేదీల్లో జహీరాబాద్‌లో జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి రాజయ్య పిలపునిచ్చారు. ఈ మేరకు ఎదురుగూడెం శాఖ పరిధిలో పార్టీ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాలక పార్టీలు ఎన్నికల సందర్భంగా వాగ్దానాలు చేస్తూ.. గద్దెనెక్కినాక ప్రజలను మర్చిపోతున్నారన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదన్నారు. అంబానీ, ఆదాని లాంటి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నదన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలపై దాడి చేస్తున్నదన్నారు. వాటిని ప్రజలు ఐక్యంగా తిపి కొట్టాలన్నారు. అనంతరం బి.నరసింహ రెడ్డి మాట్లాడుతూ.. పేదల భూములు గుంజుకొని పెద్దలకు అప్పచెబుతున్నారని ఆరోపించారు. పేదలకు భూములు పంచింది ఇళ్ల స్థలాల కోసం పోరాడింది కమ్యూనిస్టుల ఎర్రజెండానే అన్నారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నదని సీపీఐ(ఎం) మాత్రమే అన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు మహిపాల్ రెడ్డి, శాఖ పార్టీ సభ్యులు ప్రభాకర్, దర్శన్ పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గేదె మృత్యువాత

నవతెలంగాణ-కల్హేర్



చెరువులో నీరు తాగడానికి వెళ్లి కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుద్ఘాతానికి గురై గేదె మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని బాచేపల్లిలో ఆదివారం జరిగింది. బాధిత రైతు సంగమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాచేపల్లి గ్రామానికి చెందిన పుట్టి సంగమేశ్వర్ రోజువారి లాగానే గేదెను పొలానికి తీసుకెళ్లి మేత మేపుకొని సాయంత్రం సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో రోడ్డుకు ఆనుకొని ఉన్న చెరువులో నీరు తాగడానికి తీసుకెళ్లాడు. నీళ్లు తాగి గడ్డకు వస్తున్న సమయంలో చెరువు నీళ్లను ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే స్థానికులు, బాధిత రైతు వెటర్నరీ, ఎలక్ట్రిసిటీ ఆర్ఐకి సమాచారం అందించారు. బాధిత రైతుకు పాడి పశువులే జీవనాధారం అని.. కాబట్టి ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

జిగేల్ మంటూ మెరుస్తున్న వీధిలైట్లు



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీలోని పెద్ద చెరువు కట్ట నుండి అయ్యప్ప గుడి వరకు ఉన్న వీధిదీపాలు జిగేల్ మంటూ వెలుగుతున్నాయి. రాత్రి సమయంలో వెలగడం లేదని గత కొన్ని రోజుల క్రితం 'నవతెలంగాణ దినపత్రిక'లో వెలగని వీధిలైట్లు ఇబ్బంది పడుతున్న ప్రజలు అని వచ్చిన వార్తా కథనానికి అధికారులు, పాలకవర్గం స్పందించింది. మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, కమిషనర్ ఖాజా మొయినుద్దీన్, మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టారు. దీంతో పెద్ద చెరువు కట్ట నుండి 44వ జాతీయ రహదారి వరకు ఉన్న వీధిలైట్లు అన్ని జిగేల్ మంటూ వెలుగులిస్తున్నాయి. ఈ సందర్భంగా ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ స్పందన

వర్షపు నీటితో నిండిన మ్యాన్ హెూల్ రిపేర్

నవతెలంగాణ-తూప్రాన్



పురపాలక సంఘ పరిధిలో సినిమా థియేటర్ రోడ్డు వద్ద వర్షపు నీరు వల్ల గుంతలాగా మారి నీరు నిలవడంతో వాహనదారులకు, వార్డు ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవు తుండడంతో శాశ్వత పరిష్కారం దిశగా బ్రేకర్, జెసిబి సహాయంతో మ్యాన్ హెూల్ చేయించి, వాటర్‌ని అక్కడి నుంచి తరలించారు. మున్సి పల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆదేశాలతో చేపట్టిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా, మున్సిపల్ సిబ్బంది ,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఈటల నోరు అదుపులో పెట్టుకో

నవతెలంగాణ - తూప్రాన్



బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఈటెల రాజేందర్ దిగజారి మాట్లాడుతున్నారని మెదక్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బుడ్డ భాగ్యరాజ్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో ఈటల రాజేందర్ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. దేశంలో నియంతలు, శాడిస్టులు, సైకోలు ఎవరో ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. 25 రోజుల్లో రూ.18 వేలకోట్ల రుణమాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డిని సైకో అంటే అన్నం పెట్టే రైతులను గాలికి వదిలేసి,పెట్టుబడిదారులకు పట్టం కడుతున్న మోదీని ఏమని పిలవాలో ఈటెల రాజేందర్ చెప్పాలన్నారు. ఈటల రాజేందర్ చౌకబారు విమర్శలతో తన స్థాయిని తగ్గించుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గరిగే నర్సింగరావు, ఆర్ఎంపి, పి.ఎం.పి మండల అధ్యక్షులు డాక్టర్ అప్సర్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ - హవేలీ ఘనపూర్

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆపదలో లబ్ధిదారులకు వైద్య ఖర్చులు సహాయపడతాయని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పోశెట్టి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని శాలిపేట గ్రామానికి చెందిన లింగంకు రూ.30 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పోశెట్టి మాట్లాడుతూ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో గ్రామానికి నిధులు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చుంటి సిద్ధిరాములు, పారుపల్లి మల్లయ్య, పచ్చుంటి భాస్కర్, ఇలా అంజయ్య, రమేష్, యాదగిరి, ప్రశాంత్, పోచయ్య, వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో గత వారం రోజుల క్రితం పొన్నబోయిన దేవరాజు చెరువులో పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ మోహన్ మృతుని కుటుంబానికి రూ.5 వేలు, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారికి అనాధలకు అభాగ్యులకు ఆర్థిక సహాయం చేయడం తృప్తినిస్తుందన్నారు. ఎవరైనా నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్, అంజాగౌడ్, యాదగిరి, రాములు ,రాజా గౌడ్, అంజ గౌడ్, దుబ్బయ్య యాదగిరి, కిష్టయ్య, పర్శ గౌడ్, నారాయణ, నరేందర్, రాజు, రాము, ధన్రాజ్ ,బాబు, తదితరులు పాల్గొన్నారు

మనస్థాపంతో చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నార్లపూర్ గ్రామానికి చెందిన మిరుదొడ్డి కుమార్ (41) మనస్థాపంతో చెట్టుకు ఉరి వేసుకుకుని మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల తెలిపిన వివరాల ప్రకారం గత కొన్ని సంవత్సరాలుగా మిరుదొడ్డి కుమార్ ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతూ తన కుటుంబాన్ని సరిగ్గా చూసుకోలేకపోతున్నాడు. ఈమధ్యనే కుమార్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. తీవ్ర మనోవేదనకు గురైన కుమార్ ఈ నెల 5వ తేదిన సాయంత్రం 4:00 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి జీవితంపై విరక్తితో నార్లాపూర్ గ్రామ శివారులోని కమ్మరి వెంకటస్వామి వ్యవసాయ పొలంలో గల సంపంగి చెట్టుకు ప్యాంటుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గౌడ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికను నిర్వహించారు. గ్రామ గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా తాళ్ల రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నర్సింలు గౌడ్, కార్యదర్శి మధుకర్ గౌడ్, ఉప కార్యదర్శి అశోక్ గౌడ్, కోశాధికారి స్వామి గౌడ్, చంద్రం గౌడ్‌లను గౌరవ అధ్యక్షునిగా కృష్ణ గౌడ్, చంద్రంగౌడ్‌లతో పాటు పలువురిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సంఘ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి తమను ఎన్నుకున్న గౌడ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సోదరుల నమ్మకాన్ని వమ్ము కానివ్వమన్నారు. గౌడ సామాజిక అభివృద్ధికి పాటు పడతామని, సంఘ సభ్యులకు అన్ని విధాలుగా తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

బతుకమ్మ పండగ ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ తూప్రాన్



తూప్రాన్ పెద్ద చెరువు కట్టపై బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ప్రజలకు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా, రఘుపతి,జమాల్పూర్ నర్సోజి, మున్సిపల్ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ చింతల మధు, వార్డు ఆఫీసర్లు భాస్కర్, జవాన్లు ఇర్ఫాన్, వినోద్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరి అయ్యేనా?



నవతెలంగాణ-నిజాంపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నా నేటికీ మండల కేంద్రంలో అధికారులు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో చాలా మంది రోగులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఒక్కో సమయంలో మార్గమధ్యలోనే ప్రాణాలు విడుస్తున్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిజాంపేట మండల కేంద్రానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు అయిందని ప్రొసిడింగ్ వచ్చిందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి హరీష్ రావులకు, ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకాలు కూడా చేశారు. ఇప్పటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గురించి పట్టించుకున్న నాధుడే లేకపోయాడని పలువురు వాపోతున్నారు. మండల కేంద్రంలో 50 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కట్టించినట్లయితే మండలంలోని ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందంటున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వము స్పందించి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్ ప్రత్యేక చొరవ తీసుకొని మెదక్ జిల్లాకు చెందిన ఆరోగ్యశాఖ మంత్రి ఉన్నందున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించి నిర్మాణాన్ని చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నాము. వైద్యం కోసం సిద్దిపేట కామారెడ్డి హైదరాబాదు లాంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంతోమంది పేషెంట్లు వైద్యము అందక మార్గమధ్యంలోనే చనిపోతున్నారు. ప్రస్తుతమున్న ప్రభుత్వము వెంటనే స్పందించి నిజాంపేట మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయాలి.

బక్కొల్ల పరశురాములు గ్రామం :రజాక్ పల్లి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంటనే మంజూరు చేయాలి



మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరుతున్నాను. గత ప్రభుత్వము ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేశామని ప్రొసీడింగు కూడా వచ్చిందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పాలాభిషేకం చేయడం జరిగిందని ప్రొసిడింగ్ వచ్చినట్టా? రానట్టా? అర్థం కాని పరిస్థితి ఉన్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నిజాంపేట మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయాలి.

రామావత్ శంకర్, బచ్చు రాజు పల్లి :గ్రామం

వరి పంటకు నష్టం చేస్తున్న అడవిపందులు

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన చీమల బిక్షపతి 4 ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నాడు. వరి పంట చేతికి అందే సమయంలో అడవి పందులు వరి పంటలోకి చేరి పంటను మొత్తం తొక్కుతూ, వరి పంటలోనే బొర్లుతూ పంటను పూర్తిగా నేలలమట్టం చేస్తూ వరి పంటను నాశనం చేస్తున్నాయి.వరి పంటకు నష్టం కాకుండా అటవీ అధికారులు స్పందించి అడవి పందులను వరి పంట లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరారు. వేల రూపాయలు పంట పెట్టుబడి పెట్టి దిగుబడి చేతికందే సమయంలో అడవిపందుల రూపంలో పంట నష్టం జరుగుతుందని, రెండు లక్షల రూపాయల వరకు నష్టపోతానని బాధిత రైతు బోరున విలపించాడు. ఈ విషయంపై అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతు బిక్షపతి కోరారు.

జైన విగ్రహాలను సందర్శించిన జైన మత పెద్దలు

నవ తెలంగాణ టేక్మాల్



మండలంలోని వేల్పు గొండ గ్రామంలో పురాతన జైన విగ్రహాలను ఢిల్లీ, హైదరాబాద్ చెందిన జైన మత పెద్దలు ఆదివారం సందర్శించారు. వేల్పుగొండ దేవతల గుట్టపైన ఉన్న 23వ తీర్థంకుడు పార్శనర్ భగవాన్ విగ్రహాన్ని రెండు నెలల కిందట దొంగలు దొంగిలించారు. దొంగలించిన విగ్రహాన్ని అల్లాదుర్గం సీఐ రేణుక టేక్మాల్ పోలీసుల సహకారంతో తిరిగి తెప్పించారు. విషయం తెలుసుకున్న హైదరాబాద్ ఢిల్లీకి చెందిన జైన మత పెద్దలు మనోజ్ జైన్, ఆసిన్ జైన్ కుటుంబ సమేతంగా రాగా వారితోపాటు జోగిపేట వర్ధమాన్ జైన్ కృష్ణ ప్రసాద్, జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జోగినాథ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సుధాకర్ రెడ్డితో కలిసి టేక్మాల్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న జైన విగ్రహాన్ని పరిశీలించారు అనంతరం వేల్పుగొండ గ్రామాన్ని సందర్శించి విగ్రహం దొంగలించిన స్థలాన్ని పరిశీలించారు. అక్కడే ఉన్న రామ మందిరం ఆలయం కొండపై ఉన్న భారీ ఏకశిలపై చెక్కిన కాశీనాథుని విగ్రహాన్ని పరిశీలించారు ఇలాంటి విగ్రహాలు మరో కొండపై కూడా ఉన్నాయని గ్రామస్తులు వారికి సూచించారు. చైనా విగ్రహాలకు ఇక్కడే ఆలయం నిర్మించాలని గ్రామస్తులు కోరారు. పురాతన క్రీస్తు శకం 300 ఏళ్ల నాటి 23వ తీర్థంకుడు శ్రీ పార్శినాత్ విగ్రహాలుగా నిర్ధారించారు. విగ్రహాలకు ఆలయం లేదా మ్యూజియంగా ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని గ్రామస్తులతో కలిసి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ దేశ్పాండే, గ్రామస్తులు ఉన్నారు

దళితవాడలో నీటి కొరత



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని దళితవాడలో నీటి కోసం మహిళలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ నీరు రావడంలేదని గ్రామపంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు వచ్చే సమయంలో కొందరు మోటార్లను బిగిస్తూ పంపులను చాలు చేస్తున్నారని వాపోయారు. ట్యాంకు నుండి నీటిని విడుదల చేసే సమయంలో కరెంటు బంద్ చేయాలని అప్పుడైతే అందరికీ సమానంగా నీరు సరఫరా అవుతుందని మహిళలు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మిషన్ భగీరథ నీరు వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని దళిత మహిళలు వేడుకుంటున్నారు.

సాయి చరణ్ సేవలు అభినందనీయం

- వివిధ గ్రామాల్లో విరాళాల అందజేత



నవతెలంగాణ-కొల్చారం

ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షులు మన్నె సాయి చరణ్ సేవలు అభినందనీయమని పోతంశెట్టిపల్లి దుర్గామాత కమిటీ నిర్వాహకులు తెలిపా రు. ఆదివారం కొల్చారం మం డలం పోతంశెట్టి పల్లి గ్రామం లో విగ్రహ దాత ఎంఎస్ఆర్ యువసేనా అధ్యక్షులు మన్నె సాయిచరణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెంకటాపూర్ గ్రామంలో దుర్గామాతను దర్శించుకొని, అప్పాజీపల్లిలో దుర్గామాత మండప నిర్వాహకులకు రూ.20వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా అప్పాజీపల్లి దుర్గాభవాని ఉత్సవ కమిటీ నిర్వాహకులు సాయిచరణ్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. సాయిచరణ్ సేవల పట్ల ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు నాయిని వెంకట్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎల్లుగారి శ్రీనివాస్ రెడ్డి, పోతంశెట్టిపల్లి మాజీ సర్పంచ్ గడ్డమీద నాగరాణి నరసింహులు, మాజీ ఎంపిటిసి సాయిని భాగ్యలక్ష్మి సిద్ధిరాములు, ఎంఎస్ఆర్ యువసేనా సభ్యులు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేరిలా గ్రామంలో దేవి శరణ్నవరాత్రి ఉత్సవాలు

నవ తెలంగాణ-వెల్దుర్తి



దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధి చేరిల గ్రామంలో దుర్గామాత భక్తుడు బండ మల్లేష్ మాత ఆధ్వర్యంలో మల్లన్న దేవాలయ ప్రాంగణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, శ్రీ బంత్రీనమః భవాని దేదీప్య మహెూత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు అమ్మవారి సంకీర్తనలతో గ్రామంలో మంచి వాతావరణంలో నిండుకొని ఉంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నందగోకుల గ్రామానికి చెందిన సత్యవ్వకు రూ.48 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అందే స్వామి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వము అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజ్, భూపతిరెడ్డి, ఎం. కుమార్, తదితరులు పాల్గొన్నారు

అనారోగ్యంతో దళిత ఉద్యమకారుడు పల్లెపాటి కుమార్ మృతి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పల్లెపాటి కుమార్ సీనియర్ దళిత జాతి ఉద్యమకారుడు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, ఎమ్మార్పీఎస్ ఏబిసిడి వర్గీకరణ కోసం, మాదిగ జాతి హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన సీనియర్ ఉద్యమకారుడిగా గుర్తింపు పొందారు. సీనియర్ దళిత జాతి ఉద్యమకారుడి మరణం దళిత జాతికి తీరని లోటు అని పలువురు దళిత జాతి ఉద్యమకారులు పేర్కొన్నారు. జాతి కోసం పనిచేసిన దళిత ఉద్యమకారుడు పల్లెపాటి కుమార్ మరణంతో వారి కుటుంబ సభ్యుల్ని ఆదుకోవాలని పలువురు జాతి ఉద్యమకారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పల్లెపాటి కుమార్ తన సొంత గ్రామం మల్కాపూర్‌లో జరిగిన అంత్యక్రియల్లో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మాసాయిపేట యాదగిరి, సీనియర్ నాయకులు మంగని శ్రీనివాస్, సీనియర్ దళిత ఉద్యమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధి గ్రామమైన శంఖాపూర్‌లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా చైతన్యకార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్, కళా బృందం సభ్యులైన హెడ్ కానిస్టేబుల్ సురేందర్, జనార్ధన్, ఇసాక్ ప్రజలకు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మహిళల పై దాడులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలలపై దాడులు, వరకట్న వేధింపులు, ట్రాఫిక్ నిబంధనలు, నూతన చట్టాల అమలపై మాటలు, ఆటలతో చైతన్యం కల్పించారు. ట్రిబుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనం నడపడం, రాంగ్ రూట్లో నడపడం వల్ల ప్రమాదానికి గురైతే ప్రమాద బీమా చేసుకుని ఉన్నా బీమా డబ్బులు రావని తెలిపారు. చట్టాలు



ప్రజల రక్షణ, మేలు కొరకు చేశారని అధిగమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అందరూ మత్తు పదార్థాల వాడకం నుంచి దూరంగా ఉండాలని, అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోకూడదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలు కఠినంగా ఉన్నాయని తెలిపారు. , అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలు పడతాయని, పాత చట్టాల ప్రకారం ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ఉండేదని, నూతన చట్టాలతో మార్పు వచ్చిందన్నారు. ఫోన్ పై వచ్చిన ఎలాంటి లింకులను ఓపెన్ చేయకూడదన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930కు ఫోన్ చేసి తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుజాత శ్రీనివాస్, కాంగ్రెస్ మండల నాయకులు కర్ణం మల్లారెడ్డి తదితరులు

నవతెలంగాణ

4

సిద్దిపేట

సోమవారం | 07 అక్టోబర్ 2024 | www.navatelangana.com

లయన్స్ క్లబ్ స్నేహ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-గజ్వేల్



సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ 4వ నెల లయన్స్ క్లబ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ లయన్ ఉప్పల మెట్టయ్య మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడిగా లయన్ మల్లేశంగౌడ్ నియామకమై 4వ నెలకు చేరుకోవడం జరిగిందని గత 3 నెలలలో దాదాపు 400 సేవా కార్యక్రమాలు నిర్వహించడం శుభసూచికమన్నారు. రాబోయే కాలంలో సేవలు విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో ముందుకు సాగాలని లయన్స్ క్లబ్ సభ్యులకు సూచించారు. సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ఇంతకు ముందు ఏర్పాటు చేశామని అయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్ లయన్ నంగునూరి సత్యనారాయణ, లయన్ పరమేశ్వర చారి, లయన్ దొంతుల సత్యనారాయణ, లయన్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి

- మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కన్నా యాదవ్

నవతెలంగాణ-గజ్వేల్




దేవాలయాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కన్నా యాదవ్ అన్నారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రజ్ఞాపూర్‌లో పోచమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన దేవీ నవరాత్రుల ఉత్సవాలు భాగంగా దుర్గామాత వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో మున్సిపల్ అభివృద్ధి జరుగుతుందని ఆయన చెప్పారు. దుర్గామాత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దీవిస్తుందని ఆయన చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు దక్కుతున్నాయన్నారు

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో క్రైస్తవులకు న్యాయం

- కాంగ్రెస్ స్టేట్ యూత్ ప్రధాన కార్యదర్శి పూజల గోపి కృష్ణ

నవతెలంగాణ-సిద్దిపేట



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో క్రైస్తవులకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ స్టేట్ యూత్ ప్రధాన కార్యదర్శి పూజల గోపి కృష్ణ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్చార్జి పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు గుండ్ల చెరువు దగ్గరున్న పెంతకోస్ చర్చ్‌ని సందర్శించి ఆయనకు చర్చి సమస్యలు పరిష్కరించాలని చర్చి సంఘస్తులు, పాస్టర్ అమ్మ లూతీయులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకొంటుందని, చర్చికి కావాల్సిన నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రసీనియర్ మైనారిటీ నాయకులు కలిముద్దీన్, సిద్దిపేట జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, కౌన్సిలర్ బుచ్చి రెడ్డి, మిద్దె రవి, మంద పాండు, కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్, అజ్మత్, సురేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు

నవతెలంగాణ-గజ్వేల్



వృత్తి విద్యా కోర్సుల ద్వారా విద్యార్థిని విద్యార్థులకు ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉంటుందని ప్రభుత్వం మోడల్ కళాశాల మల్టీ మీడియా ఉపాధ్యాయులు నవీన్ కుమార్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వన్నేశ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు. పది రోజులపాటు ఈ కార్యక్రమాన్ని విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇందులో భాగంగానే ఆదివారం గజ్వేల్ పట్టణంలో శ్రీరామ ఫ్లెక్సీ, ఫోటోగ్రఫీ, ఫ్లెక్సీ ఎడిటింగ్, ప్రింటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ మోడల్ కళాశాల చెందిన 20 మంది ఒకేషనల్ విద్యార్థినులకు ఈ అవగాహన క్షేత్రస్థాయిలో కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఈ అవగాహన వారు ఉపాధి అవకాశాల కోసం సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాలు దొరకనప్పుడు స్వయం ఉపాధి కోసం ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ ఫ్లెక్సీ ప్రింటర్స్ ఆర్గనైజర్ వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు ఉచిత సెంటర్లు

నవతెలంగాణ-గజ్వేల్



వచ్చే మార్చి నెలలో జరిగే కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే పట్టభద్రుల కోసం గజ్వేల్‌లో ఉచిత నమోదు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ప్రసన్న హరి కృష్ణ టీం సభ్యులు మల్లికార్జున్, సాధక్ పాషా, మధు బాబు తెలిపారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో మొత్తం మూడు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయ్యప్ప దేవాలయం ఎదురుగా ఉన్న విద్యార్థి బుక్ డిపో, సంగాపూర్ రోడ్డులో ఉన్న గ్లోబల్ కంప్యూటర్ సెంటర్,పెంటాచారి హాస్పిటల్ దగ్గర ఉన్న వేంకటేశ్వర కమ్యునికేషన్ సెంటర్‌లో ఉచిత ఓటు నమోదుకు అవకాశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబర్, 2021 లోపు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. నవంబర్ 6వ తేది ఓటు నమోదుకు చివరి తేదీ అని తెలిపారు.


మత్స్యకారుల సమస్యలు మంత్రి పరిష్కరించాలి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

మత్స్యకారుల జీవనాధారమైనటువంటి చేపల పెంపకంలో భాగంగా చెరువు, కుంటలు నిండి నెలలు గడుస్తున్న ఇంతవరకు పూర్తిస్థాయిలో చేపల పంపిణీ చేయలేదని వెంటనే మత్స్యకారుల సమస్యలను మంత్రి పరిష్కరించాలని జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ పెండ్యాల ఐలయ్య, చొప్పరి శ్రీనివాస్, పొన్నబోయిన శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో 372 సొసైటీలు, మహిళా సొసైటీలు ఉన్నాయని, రూ.4 కోట్ల పైచిలుకు నిధులు కేటాయిస్తే సకాలంలో నాణ్యమైన చేప పిల్లలను తెచ్చుకుంటామని అన్నారు .టెండర్ల ద్వారా మా మత్స్యకారులకు నష్టం జరుగుతుందన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాశ బోయిన యాదగిరి, గంగాధరి రాజయ్య, పెసర రాజేశం, బిక్షపతి, రేగుల అశోక్ పాల్గొన్నారు.

మహిళలకు సౌండ్ బాక్స్ వితరణ


నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని దాచారం గ్రామ మున్నూరు కాపు, బెజ్జంకి క్రాసింగ్ గ్రామ మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా బీజేపీ మండ లాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ కొలిపాక రాజు శనివారం సౌండ్ బాక్స్ వితరణ చేశారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను సంతోషంతో జరుపుకోవాలని కొలిపాక రాజు మహిళలకు సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన పిట్ల సాయికిరణ్‌కు రూ.43.500 సీఎం సహాయ నిధి చెక్కును మర్కుక్ మాజీ ఎంపీపీ తాండ పాండు గౌడ్ ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పిట్ల మహేష్, తదితరులున్నారు.

అరచేతిలో ఆరు అంగుళాల అద్భుత బతుకమ్మ

- 1000కి పైగా బంగారం, వెండి వర్ణం గల పూసలతో బతుకమ్మ

నవతెలంగాణ-గజ్వేల్



బతుకమ్మ పండుగను పురస్కరించుకొని అరచేతిలో ఆరు అంగుళాల బతుకమ్మను బంగారం, వెండి వర్ణం గల పూసలను వెయ్యికి పైగా ఉపయోగించి అత్యద్భుతంగా తయారుచేసి ఆదివారం రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఈ బతుకమ్మను చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి అందించే పండుగ, మన సాంస్కృతి, సాంప్రదాయాలు తెలిపే గొప్ప పండుగ మన బతుకమ్మ పండుగ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు, జీవన విధానానికి ప్రతీకగా నిలిచేదే బతుకమ్మ పండుగన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూది శ్రీకాంత్ రెడ్డి

నవతెలంగాణ- సిద్దిపేట



అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూది శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్ 41వ వార్డులో సభ్యత్వం నమోదులో పాల్గొని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ సభ్యత్వం చేపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాసంగారి వెంకట్, తొడుపునూరి వెంకటేశం, ముద్దం రాజిరెడ్డి, ఎయిర్టెల్ వెంకట్, యాదవ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్లైన్ బెట్టింగ్‌తో జాగ్రత్త


- నేటి యువత ఆన్లైన్ బెట్టింగ్ అలవాట్లు పడుతున్నారు
- తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి
- తల్లిదండ్రులు పిల్లలను అదుపులో పెట్టుకోవాలి

నవతెలంగాణ-మిరుదొడ్డి

ఈ నవతరం యువత ఎక్కువగా సెల్ ఫోన్లలో ఆన్లైన్ బెట్టింగ్‌కు చాలా అలవాటుపడ్డారు. నేడు యువత సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ఆన్లైన్ బెట్టింగ్‌తో ఎంజాయ్ చేస్తున్నారు. సులువుగా వచ్చే డబ్బులు రాగానే ఎంజాయ్ చేస్తూ మద్యంతో పాటు డబ్బుకు బానిసలుగా మారారు. ఇలా బెట్టింగ్ ద్వారా డబ్బులు కాస్త సులువుగా సంపాదించాలనే ఆలోచనతో చాలామంది యువత ఆన్లైన్ బెట్టింగ్ మొగ్గు చూపుతున్నారు. ఇలా చేయడం మూలంగా కొన్ని కుటుంబాలు రోడ్డున పడి ప్రాణాలు కోల్పోతున్నారు. కష్టపడి పని చేస్తే కానీ డబ్బులు సంపాదించుకొనే ఆలోచనను మర్చిపోతున్నారు. గతంలో వారు తల్లిదండ్రులు కష్టపడితేనే డబ్బులు సంపాదించేవారు. కానీ నేటి యువత సులువుగా డబ్బులు ఎలా సంపాదించాలనే ఆలోచనతోనే ఇలాంటి చెడు అలవాట్లకు అలవాటు పడడంతో యువత మొత్తం చెడుకు బానిసలు అవుతున్నారు. సిద్దిపేట జిల్లాలో ఆన్లైన్ బెట్టింగ్ ద్వారా నేటికీ కొన్ని కుటుంబాలు రోడ్డుపాలై అనాదులుగా మారిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు, సిద్దిపేట, దుబ్బాక, మిరుదొడ్డి తో పాటు ఎన్నో మండలాల్లో యువత ఆన్లైన్ పెట్టిన ద్వారా ప్రాణాలు కోల్పోతున్నారు. ఆన్లైన్లో బెట్టింగ్ చేస్తూ తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని అమ్ముకుంటూ అలా కూడా ఆన్లైన్ బెట్టింగ్‌లో చేసిన అభివృద్ధి చేయలేక ఆత్మహత్య పాలైన సంఘటనలు చూస్తూనే ఉన్నాం. యువత ముందస్తుగా ఆలోచిస్తూ ఆన్లైన్ బెట్టింగ్ అలవాటు కాకుండా కష్టపడి డబ్బులు సంపాదించాలని ఆలోచన ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

యువత పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

దుబ్బాక సీఐ శ్రీనివాస్



యువత, విద్యార్థులు కళాశాలలో గ్రామాల్లో ఎక్కువగా మద్యానికి బానిసలు అవుతూ సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనలో చాలామంది ఉన్నారు. కొన్ని కుటుంబాలు రోడ్డుపాలై వారు అనాథలైన సంఘటన ఎన్నో ఉన్నాయి. చిన్నకోడూరులో ఆన్లైన్ బెట్టింగ్ ద్వారా ఒక ఉద్యోగి కుటుంబంతో సహా మృతి చెందిన సంఘటన తెలిసిందే. అదే మాదిరిగా సిద్దిపేట, దుబ్బాక, మిరుదొడ్డిలలో కూడా ఎంతోమంది యువకులు ఆన్లైన్ బెట్టింగ్ ద్వారా బానిసలు అవుతున్నారు. తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలి. అక్బర్ పేట భూంపల్లి మండలంలో యువకుడు ఆన్లైన్ బెట్టింగ్ ద్వారా మృతి చెందిన సంఘటన తెలిసిందే.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బరిలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-సిద్దిపేట




ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉంటున్నట్లు ప్రవేట్ పాఠశాలల సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జగ్గు మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తానని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేయాలని స్నేహితులు, శ్రేయోభిలాషుల కోరికతో నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు సామాజిక వర్గాల ద్వారా పోటీలో ఉంటానని చెప్పానన్నారు. 30 సంవత్సరాల క్రితం ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చానని, మంజీర అక్షర ప్రభ కార్యక్రమాలు ద్వారా వయోజనులకు విద్య బోధించానని తెలిపారు. 1994లో ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయునిగా పనిచేసి గురునాథ విద్యాలయం స్థాపించినట్లు తెలిపారు. గురునాథ విద్యాలయంలో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి స్థిరపడ్డారని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల గొంతుక శాసన మండలిలో వినిపించాలని, అందరి కోరిక మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో తన వంతుగా క్రియాశీల పాత్ర పోషించానన్నారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులతో కలిసి పనిచేశానన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన తనను అందరూ అక్కున చేర్చుకున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలలు దీన పరిస్థితిలో ఉన్నప్పుడు ఉద్యమంలో పాల్గొన్నామన్నారు. ఉద్యమ సమయంలో ప్రైవేటు పాఠశాలల తరఫున ప్రొఫెసర్ కోదండరాంకు తమ అభిప్రాయాన్ని తెలియజేశామన్నారు. గురునాథ విద్యాలయం ద్వారా ఎంతో మంది నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఉద్యోగం కల్పించానని చెప్పారు. ప్రైవేటు పాఠశాల కొనసాగిస్తూనే ప్రైవేట్ పాఠశాలల సంఘానికి ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పనిచేసిన, తర్వాత మూడు జిల్లాల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నానని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు కాకుండా ప్రభుత్వ ఉపాధ్యాయుల తరఫున కూడా పోరాడుతానన్నారు. సంక్షేమ నిధి ఏర్పాటుచేసి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల అభివృద్ధి కోసం వినియోగిస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం న్యూ ఎడ్యుకేషన్ పాలసీ తీసుకోస్తుందని, దీని ప్రకారం ఎస్ఎస్ సీబి బోర్డు ఇంటర్ బోర్డు ఉంటాయా ఉండవా అనేది ఎవరికి తెలియదన్నారు. ప్రభుత్వం తమను కనీసం చర్చలకు కూడా పిలువలేదని వాపోయారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు సెక్యూరిటీ లేకుండా పోయిందన్నారు. వారికోసం ఆరోగ్య బీమా, డబుల్ బెడ్ రూమ్ ఇల్లా కేటాయింపులు, అన్ని పథకాలు వారికి అందేలా చూస్తానన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని కోరారు. ఇదివరకు విస్తృతంగా ఓటు నమోదు కార్యక్రమం చేపట్టానని, రెండు పాస్ ఫోటోలు సర్టిఫికెట్లు ఇస్తే ఎండోమెంట్ చేయిస్తామన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని, ఇలాంటి వాటిని ప్రశ్నించాలంటే శాసనమండలిలో ఎమ్మెల్సీగా మనం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ సత్తయ్య, పిడిఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ప్రైవేట్ పాఠశాల యాజమాన్య సంఘం ప్రతినిధులు సంపత్ కుమార్, సత్యం, కృష్ణమాచారి, హనుమంత రెడ్డి, రమేష్, సంతోష్ కుమార్, ఎజాస్ అహ్మద్, చల్ల శ్రీనివాస్ రెడ్డి, భగవాన్ రెడ్డి, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూసి నిర్వాసితులకు హైడ్రా ప్రత్యామ్నాయం చూపాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి


నవతెలంగాణ-గజ్వేల్



అభివృద్ధి పేరుతో పేదల ఆస్తులు ధ్వంసం చేయడం తగదని, అయితే హైడ్రా మూసి బాధితులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాకే ముందుకు వెళ్లాలని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నసీరుద్దీన్, మోహినుద్దీన్ తదితరులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయకుండా, ప్రజల ఆశలు ఆకాంక్షల కనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా గత పది నెలల వ్యవధిలో రాష్ట్రంలో అభివృద్ధి పడకేసిందని, ఎక్కడి సమస్య అక్కడే నిలిచిపోయినట్లు ఎద్దేవా చేశారు. ముఖ్యంగా రైతులు, యువత, మహిళలు, ఉద్యోగ ఉపాధ్యాయులు, కార్మికులకు ఓట్ల కోసం సీఎం రేవంత్ రెడ్డి అరచేతిలో వైకుంఠం చూపినట్లు విమర్శించారు. అయితే ఇచ్చిన హామీలకు భిన్నంగా కాంగ్రెస్ సర్కార్ ముందుకెళ్తుండగా, పరిస్థితి మారకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని వివరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

సీఎం రేవంత్ రెడ్డి బుద్దిని మార్చాలి

- బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ ఇన్చార్జి ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలను కంటతడి పెట్టిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి బుద్ధిని మార్చాలని బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ ఇన్చార్జి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బాంబే కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సాహాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దుర్గామాత కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలలో మార్పు తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత పది నెలలుగా రాష్ట్రంలో ప్రజలు గోసలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా హైడ్రా పేరుతో హైదరాబాద్ సర్వనాశమవుతుందని ఆవేదన చెందారు. తమ ఆవేదనను దుర్గామాత మన్నించి సీఎం రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి వచ్చేలా చూడాలని ఆయన కోరారు. గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మూసీ నది తీరాన నివసిస్తున్న ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన కేసీఆర్‌ను ప్రజలు కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు గడియారం వెంకట చారి, వెంకటేశం, చిరంజీవి, నాగేష్, స్వామి, బాబా, శ్రావణ్, రోహిత్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు













నవతెలంగాణ-సిద్దిపేట



శ్రీశ్రీశ్రీ అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి దేవాలయంలోదేవీ శర్నవరాత్రి ఉత్సవాలు ప్రారభమయ్యాయని ఆలయ నిర్వహకులు కిరణ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనం ఇచ్చారని తెలిపారు. ఉదయం శ్రీ చక్ర నవావర్ణ పూజ, కుంకుమార్చన నిర్వహించి, చండిహోమం నిర్వహించడం జరిగిందని, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించినట్లు తెలిపారు. అమ్మవారికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి ఓడి బియ్యం సమర్పించుకున్నారని తెలిపారు. వైదిక నిర్వాహకులు బ్రహ్మశ్రీ పూసాల వెంకటాచార్యులు మాట్లాడుతూ చండిహోమము ప్రతి రోజు జరుగుతుందని, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకి పాత్రులు కాగలరని కోరారు.

నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో మహంకాళి అమ్మవారి గుడి సన్నిధిలో దేవి శరన్న నవరాత్రుల్లో భాగంగా రెడ్డి సంఘం, ది రాక్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చల్లారం లక్ష్మి వైఫ్ ఆఫ్ కీర్తిశేషులు చల్లాం లింగారెడ్డి కుమారులు చల్లారం బలరామకృష్టారెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్నదాత రెడ్డి, సంఘం సభ్యులు, రాక్ స్టార్ యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు, అమ్మవారి భక్తులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

అమ్మవారి అనుగ్రహంతో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని చండీ హెూయం నిర్వహించామని పూజారి రణధీరచార్యులు అన్నారు. మండలం పాలమాకుల వేంకటేశ్వరాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక చండీ హెూమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదం అందజేసి అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, రామానుజం, మల్లేశం. బుచ్చిరెడ్డి, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

మండలం వ్యాప్తంగా శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 22 సంవత్సరాలుగా యువకులు ఉత్సవాలు జరపడం శుభపరిణామమన్నారు. అనంతరం రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఆదివారం విజయదుర్గా మాత లలిత త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాధ శర్మ పర్యవేక్షణలో గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయదుర్గా మాతకు విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలతో అలంకరించి చతుష్షష్టి ఉపచారపూజ చేశారు. అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరన కావించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తిరుపతి రెడ్డి, నరసింహారెడ్డి, రవీందర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఒడిబియ్యం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మర్పడగ దేవాలయంలో ఆదివారం మహిళలు అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కుంకుమ పూజలు చేశారు.

నవతెలంగాణ-మద్దూరు

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద ఆదివారం అర్చకుడు పానుగంటి తిరుపతయ్య, ఆధ్వర్యంలో కుంకుమార్చన, పుష్పార్చన, కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో కమిటీ సభ్యులు సురేష్ కుమార్, తిరుపతి, రాజు, ప్రసాద్, కరుణాకర్, రాకేష్, తదితరులు ఉన్నారు.



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని దేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా పాలమాకుల, అక్కెనపల్లి, కొండంరాజుపల్లి, ఖాతా, అంక్షాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గా దేవిని బీఆర్ఎస్ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని యువత సాదరంగా ఆహ్వానించగా మాణిక్యాలతో మహిళలు హారతి ఇవ్వగా గ్రామ ప్రజలు డబ్బు చప్పులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రోత్సవాలల్లో భాగంగా తనను మీ గ్రామానికి ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. దుర్గా దేవి ఆశీస్సులతో మీరు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఇంత ఆత్మీయంగా తనను మీరందరూ ఆహ్వానించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యెళ్ల మాధవ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు దశమంతా రెడ్డి, అక్కెనపల్లి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్‌లు ఓజాల్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నరోత్తం రెడ్డి, పబ్బ అనంతరాజయ్య, పరమేశ్వర్, నర్సింహ్మారెడ్డి, సాయి రెడ్డి, శ్రీకాంత్, రమేశ్, పరశు రాములు, గ్రామ యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ గ్రామంలోని మహంకాళి, దుర్గ దేవి ఆలయంలో ఆదివారం అన్నదానం చేశారు. దుర్గాష్టమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులు తెలిపారు. ఇటీవల ఆలయ నిర్మాణం పనులు పూర్తి చేశామన్నారు. గుడి నిర్మాణం లో డాక్టర్ కూకట్ల రాజేశ్వర్, జనగామ శ్రీధర్ రావు, శ్రీనివాస్ విరాళాలు అందించినట్లు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చెర్మన్ జనగామ రాంకిషన్ రావు, దుంద్ర ఎల్లయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు, ముగ్గురికి గాయాలు




నవతెలంగాణ-కొండపాక

లారీని వెనుకవైపు కారు ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన కొండపాక గేటు వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామానికి చెందిన శేఖర్ దుబాయ్ నుంచి వచ్చాడు. ఆయన మిత్రులు అజయ్, సతీష్ ఇద్దరు కలిసి ఎయిర్ పోర్ట్ నుంచి తీసుకొని కారులో వడ్లూరుకు వెళ్తున్న క్రమంలో కొండపాక గేటు వద్ద రాజీవ్ రహదారిపై ముందుగా వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేసి ఎడమవైపు తీసుకుంటున్న క్రమంలో వెనుక వైపు కారు ఢీకొట్టింది. దాంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమై బెలూన్స్ ఓపెన్ అయ్యాయి. కారులో ప్రయాణం చేస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ చేరుకొని ప్రథమ చికిత్స చేశారు.

సేవా భారతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు



నవతెలంగాణ-గజ్వేల్

సేవా భారతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ ఆకుల నరేష్ బాబు తెలిపారు. ఆదివారం ప్రధానమంత్రి మోడీ జన్మదిన పురస్కరించుకొని వారం రోజులపాటు సేవా భారతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే సేవా పక్వాడా నేపథ్యంలో నేషనల్ మెడికోస్ ఆర్గనైజర్ వారు ఉచిత ఫిజియోథెరపీ సర్జైజ్ ఫిజియోథెర పీ, రిహాబ్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో వైద్యులు లింగం, శ్రీధర్, సాయినాథ్ రెడ్డి, శివ కుమార్, బీజేపీ నాయకులు వెంకటరమణ, ఎల్లురామిరెడ్డి, అరవిందు, రమణ, బాల్ కుమార్, విష్ణు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భద్రత అందరి బాధ్యత



- ఎస్ఐ విక్కుర్తి రఘుపతి

నవతెలంగాణ-రాయపోల్

నేటి బాలలే రేపటి పౌరులని, భవిష్యత్తు భారతావనికి వారే పునాదులని, వారిని కంటికి రెప్పలాగా కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఎస్ఐ విక్కుర్తి రఘుపతి తెలిపారు. ప్రతి సంవత్సరం దసరా సెలవులలో ఎంతో మంది అమాయక విద్యార్థులు ఆకారణంగా ప్రాణాలు పోగొట్టుకొని కన్న వారికీ కడుపుకోత మిగిలిస్తున్నారని ఆయన తెలిపారు. పిల్లల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. చెరువులలో, బావులలో, కుంటలలో, మడుగులలో పిల్లలను ఈతకు ప్రోత్సహించరాదన్నారు. స్విమ్మింగ్ పూల్‌లకు పెద్దలు ఎవరైనా వెంట లేకుండా ఈతకు పంపరాదన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే ప్రమాదం జరగక ముందే జాగ్రత్త పడడం మంచిదని గుర్తించి సంతోషంగా ఉండటం మంచిదని ఎస్ఐ రఘుపతి ప్రజలకు సూచించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థి



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు నారాయణరావుపేట విద్యార్థి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్డేపల్లి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన సిద్దిపేట క్రికెట్ స్టేడియం నందు నారాయణరావుపేట విద్యార్థి రామ్ చరణ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సిద్దిపేట ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ అండర్ 14 పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే రాష్ట్ర క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు తోట సతీష్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

బతుకమ్మ సంబరాల్లో మున్సిపల్ చైర్ పర్సన్



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణ 33వ వార్డులోని దాసాంజనేయ ఆర్యవైశ్య ఫ్యామిలీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలలో మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు పాల్గొన్నారు. అనంతరం దేవి నవరాత్రులలో భాగంగా పట్టణంలోని శ్రీ శాంభవి ఫ్రెండ్స్ యూత్, శ్రీ నవదుర్గ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అయిత రత్నాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు మరియాల సూర్యప్రకాష్, మొరంశెట్టి వెంకటేష్, శ్రీకాంత్, బిఆర్ఎస్ నాయకులు మొయిజ్, కౌన్సిలర్ సాయన్నగారి సుందర్ దంపతులు పాల్గొన్నారు.

శిల్పకళా వేదికకు తరలిన ప్రజా ప్రతినిధులు



నవతెలంగాణ-మర్కుక్

రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని శిల్పా కళావేదికలో నిర్వహించిన రెడ్డి తెలంగాణ ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమానికి మర్కుక్ మండల రెడ్డి జేఏసీ అధ్యక్షులు రాజన్నగారి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి ప్రజా ప్రతినిధులు ఆదివారం భారిగా తరలారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, చాడ సుధాకర్ రెడ్డి, సిద్ధారెడ్డి, హన్మమంత రెడ్డి, నరసింహా రెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులున్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-సిద్దిపేట

ఐదవ రోజు అట్ల బతుకమ్మ సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు హాజరై బతుకమ్మను పేర్చారు. స్థానిక వార్డు కౌన్సిలర్ కొండం కవిత సంపత్ రెడ్డి, వార్డు మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలిసిన వారికి కొంగుబంగారం పాపమ్మగడ్డ దుర్గామాత



నవతెలంగాణ-రాయపోల్

కొలసిన వారికి కొంగుబంగారం పాపమ్మ గడ్డ దుర్గామాత విరాజిల్లుతుంది. దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దౌల్తాబాద్ మండల కేంద్రంలో పాపమ్మ గడ్డ దుర్గామాతగా పిలువబడే అతి పురాతనమైన దుర్గమ్మ దేవాలయాన్ని పునః నిర్మాణం చేసిన విషయం తెలిసిందే. అప్పటినుంచి ప్రతినిత్యం అమ్మవారికి భక్తులు పూజలను నిర్వహించి ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అలాగే ప్రతి సంవత్సరం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలను నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లలిత త్రిపుర సుందరిగా అమ్మవారి దర్శనం ఇవ్వగా, ప్రత్యేక పూజలను నిర్వహించడం జరిగింది. అదే మాదిరిగా ప్రతిరోజు భక్తులకు అమ్మవారికి ఇష్టమైన రోజుకొరకం తీర్థప్రసాదలను నైవేద్యం రూపంలో సమర్పించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో జల్లిపల్లి బ్రహ్మం ప్రవచనం



నవతెలంగాణ- రాయపోల్

దౌల్తాబాద్ మండల కేంద్రంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ దుర్గాభవాని ఆలయంలో సోమవారం దుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే దుర్గాదేవి ప్రాముఖ్యతను భక్తులకు తెలియజేయడం కోసం ఉపాధ్యాయ రత్న డాక్టర్ జల్లిపల్లి బ్రహ్మం చేత ఉపాసన దేవి వైభవం అంశంపై ప్రవచనం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పనులు పూర్తయినా.. ప్రారంభానికి అడ్డంకులు

- ఏడాదిన్నరగా ఎదురుచూపులే..
- మానవ విసర్జిత వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం ప్రారంభం ఎప్పుడో..!




నవతెలంగాణ- దుబ్బాక

దుబ్బాక మున్సిపాలిటీలో మానవ విసర్జిత ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్ మెంట్ ప్లాంట్- ఎఫ్.ఎస్.టీ.పీ) నిర్మాణం దాదాపు పూర్తయింది. దాదాపు ఏడాదిన్నరగా ఎదురుచూపులు తప్పడం లేదు. దీంతో స్వచ్ఛభారత్ లక్ష్యానికి నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈ కేంద్రాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారు..? అన్న సందేహం పట్టణ వాసుల్లో నెలకొంది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి దుంపలపల్లి వార్డుకు వెళ్లే మార్గంలో ఒకటిన్నర ఎకరా స్థలంలో రూ.73 లక్షల (పట్టణ ప్రగతి నిధులు)తో ఎఫ్.ఎస్.టీ.పీ ప్లాంటు నిర్మాణం చేపట్టారు. 2021 డిసెంబర్ 31 న అప్పటి రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్ రావుచే ఈ ప్లాంటు పనులకు శంకుస్థాపన చేశారు.

ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు

స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషితో పట్టణాల్లో బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధితమైంది. తద్వారా ప్రతి ఇంట్లో మరుగుదొడ్ల నిర్మాణం జరిగి వాటి వాడకం పెరిగింది. ఫలితంగా నేడు ఇళ్లలో నిండిన మరుగుదొడ్డికి సంబంధించిన సెప్టిక్ ట్యాంకుల నుంచి మలాన్ని కొందరు వ్యాపారులు ట్యాంకర్ల ద్వారా రవాణా చేస్తూ, పట్టణ శివారు ప్రాంతాలు, గ్రామ చెరువుల్లో పారవేస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాలకు గురై వ్యాధుల బారిన పడుతున్నారు. దీన్ని అరికట్టేందుకు, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాలను నిర్మిస్తోంది. ఇండ్లలో నిండిన మానవ మల వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా ఎఫ్.ఎస్.టీ.పీ కేంద్రానికి తరలిస్తారు. పలు పద్ధతుల్లో ఈ వ్యర్థాలను దశల వారీగా శుద్ధి చేసి సేంద్రీయ ఎరువుగా తయారు చేస్తారు. ఈ ఎరువును పొలాల్లో, ఇతర వ్యవసాయ పంటల సాగుకు వినియోగించుకోవచ్చు.

6 రకాల యంత్రాలచే మల వ్యర్థాల శుద్ధీకరణ

మూడున్నరేళ్ళ క్రితం మల వ్యర్థాల శుద్ధీకరణ కోసం ఈ నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు పూర్తయి వివిధ యంత్ర పరికరాలు బిగించడంతో ప్రారంభానికి సిద్ధమైంది. చుట్టూ ప్రహరి గోడ నిర్మాణం, మల వ్యర్థాలను శుద్ధి చేసేందుకు వీలుగా 4 గదులను నిర్మించారు. వీటిలో 6 రకాల యంత్రాలను (ట్రాన్స్‌ఫర్ స్టేషన్, క్లారిఫైయర్, ఎయిర్ బ్లోయర్, థర్మల్ ప్రాసెసింగ్ మీటర్లు, కన్వేయర్ మోటార్లు, ఫర్ద్ స్క్రూ కన్వేయర్ యంత్రాలు) ఏర్పాటు చేశారు. నీటి వ్యర్థాల నిల్వలకు సంపులను నిర్మించారు.

ప్రారంభానికి అడ్డంకులు

ఎఫ్ఎస్‌టీపీ కేంద్రాన్ని గతేడాది అక్టోబర్ 2న అప్పటి మంత్రి హరీష్ రావు ప్రారంభించేందుకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కానీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి అడ్డంకి ఏర్పడింది. ఎన్నికలు పూర్తయి 10 నెలలు సమీపిస్తున్నా ఎఫ్ఎస్‌టీపీ కేంద్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు.

త్వరలోనే ప్రారంభిస్తాం

కమిషనర్

ఎఫ్.ఎస్.టీ.పీ కేంద్రంలో వివిధ యంత్ర పరికరాల బిగింపు ప్రక్రియ పూర్తయిందని.. త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తామని మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్ తెలిపారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు సహకారంతో గతంలో అనారోగ్యంతో బాధపడి ఉండగా వారికి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామన్నారు. సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలను అమలే చేయలేకపోయిందని విమర్శించారు. వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల చేసిన రుణమాఫీ తూతూ మంత్రంగా చేసిందని, ఇంకా చాలా మంది రైతులు రోడ్డు మీదకి వచ్చి ధర్నాలు చేస్తున్నా పట్టనట్టు రేవంత్ ప్రభుత్వం ఉందన్నారు. వెంటనే ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వానాకాలం పంటకు సంబంధించి ఇప్పటివరకు రైతు బంధు నిధులు వేయలేదని వెంటనే రైతుల ఖాతాలలో జామచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మాజీ మండల అధ్యక్షుడు మద్ది రాజిరెడ్డి, చడా శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, స్వామి, లబ్ధిదారుల కుటుంబాలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు చిల్లర మాటలు మానుకోవాలి

- ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ నాయకులు చిల్లర మాటలు మానుకోవాలని ఎఫ్డీసి మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నాయకులు చిల్లర వేషాలు వేస్తున్నారని విమర్శించారు. ప్రజలు తిరగబడే రోజు త్వరలో వస్తుందన్నారు. కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీకి సిద్ధమవుతుందన్నారు. వారం రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. రైతు బీమా, రైతుబంధువు జాడలేదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు లేదని విమర్శించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, వైస్ చైర్మెన్ జకీర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాస శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మల్లేశం, మండల అధ్యక్షులు బెండ మధు, మాజీ సర్పంచులు మద్దూరు శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, నాయకులు హైమద్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు విజయవంతం చేయాలి



నవతెలంగాణ-మర్కుక్

శామీర్ పేటలోని అంతాయిగుడా ఎస్ఎస్ఆర్ పుష్ప గార్డెన్స్‌లో నిర్వహించే పీఆర్‌టీయూ 34వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని పీఆర్టీయూ మర్కుక్ మండలాధ్యక్షులు రేబల్లి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి తుమ్మ కుమార్‌లు కోరారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అక్టోబర్ 7, 8 తేదీలలో నిర్వహించే సమామేశాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు. సమావేశాలలో మొదటి రోజు పీఆర్‌టీయూ సాధించిన సాధించిన విజయాలు, ఇంకా అపరిష్కృతంగా ఉన్న సమస్యల సాధనకై రాష్ట్ర కార్యవర్గం తీర్మానాలు చేయనున్నారని తెలిపారు. ఇందుకుగాను రాష్ట్ర బాధ్యులు జిల్లా బాధ్యులు మండల బాధ్యులు సంఘానికి ప్రాణప్రదమైన ప్రాథమిక సభ్యులు సంఘ శ్రేయోభిలాషులు అందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. రెండవ రోజు 2024-26 సంవత్సరానికిగాను రాష్ట్ర శాఖ ఎన్నికలు నిర్వహించబడతాయని, రాష్ట్రంలో అత్యధిక మెంబర్షిప్ కలిగి అతి పెద్ద సంఘం పీఆర్టీయూ టీఎస్ సంఘమన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు హాజరై సంఘ పటిష్టతకు ఉపాధ్యాయులను కృషి చేయాలన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సహకరించాలి

- భవిష్యత్తు ఉద్యమాలకు కలిసి రావాలి
- ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రస్తుతం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ వెంటనే అమలు చేయాలని, ఎస్సీ ఉప కులాలు సహకరించాలని ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ యాదగిరి కోరారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చేసిన వర్గీకరణ హామిని అమలు చేసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. అలాగే దళితుల ఉమ్మడి సమస్యలపై అందరూ కలిసి రావలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి సమస్యల సాధన ప్రక్రియ కొనసాగుతూనే రాజ్యాధికార దిశగా అడుగులు వేయడానికి అందరకు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. దళితులకు ఉన్న అనేక సమస్యలు సాధించుకోవడానికి ఉమ్మడి కార్యాచరణలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో చేబర్తి యాదగిరి మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉప్పరిపల్లి నాగభూషణం, మాదిగ ఆర్గనైజింగ్ సెక్రటరీ, పోతగల్ల మహేష్ మాదిగ, ఎర్రోళ్ల గంగాధర్ మాదిగ, మాచపురం యాదయ్య మాదిగ, గజ్వేల్ నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

బహుజన బతుకమ్మను విజయవంతం చేద్దాం



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గత 15 సంవత్సరాల నుంచి భూస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పీడిత కులాల పక్షాన విమలక్క బహుజన బతుకమ్మగా ప్రజల మధ్యకు వస్తుందని నవ చైతన్య సేవాసమితి అధ్యక్షులు ఎం ప్రకాష్ రావు అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం అక్కారంలో బహుజన బతుకమ్మ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరివస్త్రంచారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రావు మాట్లాడుతూ విమలక్క ఆధ్వర్యంలో ప్రతి ఏటా బహుజన బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పర్యావరణం, మత్తుపదార్థాలు, స్త్రీల హక్కులు మొదలైన విషయాల పట్ల ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. నెల 9న జరిగే బహుజన బతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామంలోని యువజన సంఘాలు, మహిళలను కోరారు. దేశంలో మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ స్త్రీలు గౌరవంగా జీవించే హక్కును చాటి చెప్పె ఏకైక వ్యక్తి విమలక్క అన్నారు. బహుజన బతుకమ్మను విమలక్క బహుజన బతుకమ్మ నిర్మాణ కమిటీ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే దేవేందర్ రెడ్డి, టీపీటీ ఎఫ్ రాష్ట్ర నాయకులు ఏ రామచంద్రం, జిల్లా నాయకులు పి ఎల్లయ్య, ఏం సత్తయ్య, కట్కం గ్రామ మహిళలు, బాలికలు,తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్‌లెస్ డేలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో జరుగుతున్న 'బ్యాగ్‌లెస్ డే' లో భాగంగా.. విద్యార్థులు పలు రకాల కళారూపాలను నిర్మించారు. పేపర్ బ్యాగ్స్ తయారీ, పతంగుల తయారీ కాగితాలతో రకరకాల అలంకరణ వస్తువుల తయారు, కుట్లు అల్లికలు, పెయింటింగ్, గోరింటాకుతో విభిన్న డిజైన్లు వేశారు. వెల్డింగ్ వర్క్, వివిధ పనులు సిమ్మెంటుతో చేయడం, మట్టి బొమ్మల తయారీ స్టీలు వస్తువులపై పెయింటింగ్ రకరకాల వంటకాలను రుచికరంగా తయారు చేశారు. బేసిక్ ఎలక్ట్రీషియన్ శిక్షణ, కిచెన్ గార్డెన్‌లో వివిధ కూరగాయల పెంపకం, రంగవల్లులు దిద్దడం, యోగలో శిక్షణ నర్సరీ నిర్వహణ, రోజ్ గార్డెన్ పెంపకం వంటి వివిధ అంశాలతో కూడిన కార్యక్రమాలలో విద్యార్థులు విద్యార్థినులు ఉత్సాహంగా తమ తమ ప్రతిభను కనబర్చారు. వ్యక్తిగత శిక్షణ కార్యక్రమంలో భాగంగా నవోదయ పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షుడు రామకృష్ణ, టెక్నికల్ డైరెక్టర్ తన ఉపన్యాసంలో పూర్వ స్మృతులను గుర్తుతెచ్చుకుంటూ నవోదయ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో రాణించాలని కోరారు. వ్యక్తిగతంగా పైకి ఎదగాలని గ్రామీణ ప్రాంతంలో నుంచి వచ్చిన విద్యార్థులకు నవోదయ విద్యాలయం ఒక వరంలాంటిదన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తతతో మెలగాలని సైబర్ సెక్యూరిటీని గురించిన వివిధ అంశాలను వివరించారు. ప్రముఖ సంగీత విద్వాంసులైన శ్రీహరి చరణ్, జయప్రకాష్, గిటారిస్టు ప్రేమ్ కుమార్, వేణునాద నిపుణులు వెంకటరామ్‌లు సంగీత విభావరి విద్యార్థులను విద్యాలయం సిబ్బందిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన వారికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్‌లకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందజేస్తా

- ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-నంగునూరు

ముదిరాజులకు ఎల్లవేళలా తమ వంతుగా సహాయ సహకారాలు అందజేస్తానని ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా మండలం నర్మెట గ్రామంలో ముదిరాజ్ కులస్థుల ఆధ్వర్యంలో పునః నిర్మాణం చేయనున్న పెద్దమ్మ తల్లి దేవాలయానికి కొబ్బరి కాయలు కొట్టి పనులను ప్రారంభించారు. అంతకు ముందు ముదిరాజు కులస్థులు, మహిళలు మంగళహారతులతో గ్రామం నుంచి పెద్దమ్మ తల్లి దేవాలయం వరకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల సంఘాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ముదిరాజు కుల సంఘం సభ్యుల చాలా ఐక్యమత్యంగా ఉన్నారని, ఎప్పటికీ ఇలాగే ఐక్యతగా కొనసాగాలని ఆశించారు. నేటి యువకులే రేపటి భావితరాలకు మార్గదర్శకాలని, యువకులు ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘం అధ్యక్షుడు గట్టు బాలయ్య, సభ్యులు లక్ష్మయ్య అప్పల శేఖర్ యాదవ్, రాములు, బాలయ్య రాజు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వినూత్న రీతిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న యూత్ సభ్యులు



నవతెలంగాణ-చేర్యాల

శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేర్యాల పట్టణంలోని చావడి వీధిలో దేవిస్నేహ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి మండపం వద్ద యూత్ సభ్యులు వినూత్న రీతిలో ప్రజలకు ప్రస్తుత సమాజంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మహిళలపై అత్యాచారాలు, డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత బానిసలుగా మారడం, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతుండడం వంటి పలు అంశాలపై ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలు, యువతులపై జరుగుతున్న అత్యాచారాలను నివారిద్దాం, స్త్రీలను గౌరవిద్దాం. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను తరిమికొడదాం, యువత జీవితాలను కాపాడుకుందాం వంటి సూచనలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో ఆడవాళ్లపై జరుగుతున్న అత్యాచారాలు, యువత డ్రగ్స్, గంజాయి వంటి వాటికి బానిసలుగా మారి జీవితాలను పాడు చేసుకుంటున్నారని, రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం యువతే ప్రాణాలు కోల్పోతున్నారనే ఉద్దేశంతో ప్రజలలో కొంతైనా మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో అమ్మవారి సన్నిధిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి తమవంతు బాధ్యతగా అవగాహన కల్పిస్తున్నామని యూత్ సభ్యులు తెలిపారు. ఇప్పటికైనా మారుతున్న కాలానికనుగుణంగా ప్రజల్లో ముఖ్యంగా యువతలో మార్పు రావాలని మహిళలపై అత్యాచారాలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ స్త్రీలను గౌరవించాలని, డ్రగ్స్ గంజాయి వంటి మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి అమ్మవారికి కేవలం భక్తి భావనతో పూజలే కాకుండా సమాజం పట్ల బాధ్యతతో ప్రజలకు సమాజంలోని ప్రస్తుత పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్న యూత్ సభ్యులను పలువురు అభినందిస్తున్నారు.

అమ్మవారు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

దుర్గమాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడక దమ్మచెరువు బండ చర్లపల్లి గ్రామాలలో ఏర్పాటుచేసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలులో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆయనకు గ్రామస్తులు గజమాలతో సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని తెలిపారు.

9న సీఎం కప్ టార్చ్ ర్యాలీ

నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్ర క్రీడాపాధికార సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ మాసంలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడల్లో పాల్గొనడానికి చేపట్టిన సీఎం కప్ టార్చ్ ర్యాలీ ఈ నెల 9న మండల పరిధిలోని రేగులపల్లి, బెజ్జంకి క్రాసింగ్, తోటపల్లి గ్రామ మీదుగా కరీంనగర్ జిల్లా శివారుకు వెళ్తుందని ఆదర్శ విద్యాలయ పీడీ బయ్యారపు కనకారెడ్డి తెలిపారు. సీఎం కప్ టార్చ్ ర్యాలీలో మండలంలోని క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని పీడీ కనకారెడ్డి కోరారు.